

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 21-06-2026 | సంపుటి - 29 | సంచిక -29 | రూ : 4 | పేజీలు: 8


## విద్యార్థి వీసాకు నాలుగేళ్ల కాలపరిమితి..!

- శ్వేతసౌధం కసరత్తు పూర్తి




వాషింగ్టన్: ఎఫ్1 వీసాపై వచ్చే విదేశీ విద్యార్థులు అమెరికాలో బస చేసే కాలానికి పరిమితులు విధించే కొత్త నిబంధనపై శ్వేతసౌధం కసరత్తు పూర్తి చేసింది. ఇప్పటికే దీనికి ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ ఆమోదం తెలిపింది. ఇక దీనిని అధికారికంగా ప్రకటించడమే తరువాయి.. అమల్లోకి రానుంది. హోంలాండ్ భద్రతా విభాగం (డీహెచ్ఎస్) ప్రతిపాదించిన ఈ నిబంధన అమల్లోకి వస్తే విద్యార్థి వీసాపై అమెరికాకు వచ్చినవారు నాలుగేళ్ల నిర్దిష్ట కాలమే అమెరికాలో ఉండటానికి అవకాశం ఉంటుంది. ఆ తర్వాత కోర్సు పూర్తి చేయడానికి కొనసాగాలనుకుంటే డీహెచ్ఎస్‌వద్ద రెన్యువల్ చేసుకోవాలి. ప్రస్తుత విధానం ప్రకారం. విద్యార్థి తన చదువు పూర్తయ్యేంత వరకూ అమెరికాలో ఉండవచ్చు. కోర్సు పూర్తికి మరింత సమయం అవసరమైతే విద్యా సంస్థకు చెందిన డిజిగ్నేటెడ్ స్కూల్ అధికారి ద్వారా ఏడాది చొప్పున వీసా కాలాన్ని పొడిగించుకుంటూ పోవచ్చు. తాజా నిబంధన ఈ ఆనవాయితీకి అడ్డుకట్ట వేయనుంది. కొత్త నిబంధన ఎఫ్, జే, ఐ వీసాలపై అమెరికా సందర్శించే వారి బసకు సంబంధించిన కాల పరిమితిని విధించనుంది.



# నేడు నీట్ రీ-ఎగ్జామ్

- నిర్వహణకు సర్వం సిద్ధం
- దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది దరఖాస్తు
- రాష్ట్రంలో 199 పరీక్షా కేంద్రాలు, 73,084 మంది విద్యార్థులు

హైదరాబాద్‌బ్యూరో : వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించే నీట్ (యూజీ)2026 రీఎగ్జామ్ ఆదివారం జరగనుంది. ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో రద్దు చేసిన గత పరీక్షకు బదులుగా జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ఈ రీఎగ్జామ్‌ను నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్ష కోసం నమోదు చేసుకున్నారు. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో 5,432 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నారు. తెలంగాణ నుంచి 73,084 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొత్తం 199 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాయి. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పెన్‌అండ్‌పేపర్

తరువాయి 2లో

## మూడ్రోజులు ఢిల్లీలో సీఎం

- రైల్వే మంత్రితో సమావేశం ఏర్పాటు చేయించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి రేవంత్ లేఖ



హైదరాబాద్: ఎన్సీపీ(ఎస్‌పీ) నేత శరద్‌పవార్ మనవరాలు, ఎంపీ సుప్రియా సులే కుమార్తె వివాహ రిసెప్షన్‌కు శనివారం ముంబయి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆదివారం ఢిల్లీ వెళ్లనున్నారు. సోమ,మంగళవారాలు అక్కడే ఉండి పలు అంశాలపై కేంద్ర మంత్రులను కలవనున్నారు. ఇందులో భాగంగా మెట్రోకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్‌ఎఫ్‌సీ) నుంచి రుణం, రెండోదశ గురించి చర్చించేందుకు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ముఖ్యమంత్రి

తరువాయి 2లో

## చంద్రబాబుపై రాందేవ్ బాబా ప్రశంసలు

- ఉండవల్లిలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబుపై రాందేవ్ ప్రశంసలు
- చంద్రబాబును యోగి, కర్మ యోగిగా అభివర్ణించిన యోగా గురువు



2లో

# పీఎం కిసాన్ 23వ విడత: నిధులు విడుదల

- 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 18,880 కోట్లు జమ
- ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం
- పశ్చిమ బెంగాల్‌లోని తారకేశ్వర్ నుంచి నిధుల బదిలీ కార్యక్రమం

ఢిల్లీ : ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి, ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడత కింద దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ. 18,880 కోట్లకు పైగా నగదు జమ అయింది. 'పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్' సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం అందింది. వ్యవసాయ పనులతో పాటు ఇతర కుటుంబ అవసరాలకు ఈ మొత్తం రైతులకు సకాలంలో అండగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ. 6,000 చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తాజా విడుదలతో కలిపి ఈ పథకం కింద ఇప్పటివరకు రూ. 4.46 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విడతలో పశ్చిమ బెంగాల్‌లోని 45.35 లక్షల మంది రైతులకు రూ. 907 కోట్లు, గుజరాత్‌లోని 51.28 లక్షల మంది రైతులకు రూ. 1,025 కోట్లు అందాయి. దేశవ్యాప్త లబ్ధిదారులలో 2.18 కోట్లకు పైగా మహిళా రైతులు ఉండటం గమనార్హం. పథకం



ప్రయోజనాలను సక్రమంగా పొందేందుకు రైతులు తమ ఈకేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు తమ పేరును జాబితాలో తనిఖీ చేసుకునేందుకు pmkisan.gov.in వెబ్‌సైట్‌లోని 'ఫార్మర్స్ కార్నర్'ను సందర్శించవచ్చు.

## హర్మూజ్ జలసంధిపై ఉద్రిక్తతలు చమురు సరఫరాకు ముప్పు!

- లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా హర్మూజ్ జలసంధి మూసివేత
- కీలకమైన జలమార్గంపై మళ్లీ పూర్తి నియంత్రణ ప్రకటించిన ఇరాన్
- ప్రపంచ చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం
- ఇరాన్ చర్య ఆమోదయోగ్యం కాదన్న అమెరికా
- కాల్పుల విరమణ ఉల్లంఘన వల్లే ఈ నిర్ణయమన్న టెహ్రాన్

2లో





## అయోధ్యలో తిరుమల తరహా పాలన నృపేంద్ర మిశ్రా ప్రతిపాదనలు!

- అయోధ్య విరాళాల వివాదంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ
- ఆలయానికి తిరుపతి తరహా పాలన ఉండాలని నృపేంద్ర మిశ్రా సూచన
- సీఈవో నియామకం, పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని ప్రతిపాదన
- నిజానిజాలు తేలుస్తామన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్
- భక్తుల నమ్మకాన్ని కాపాడటమే లక్ష్యమని స్పష్టం చేసిన ఆలయ కమిటీ

2లో

## అంగారకుడిపై ఆశ్చర్యపరిచే రాయి శాస్త్రవేత్తల పరిశోధన!



- అంగారకుడి ఉల్క శకలంలో కొత్త రకం రాయి
- తొలిసారిగా గార్నెట్ ఖనిజం గుర్తింపు
- NWA 8171 నమూనాపై పరిశోధన
- లేజర్, ఎలక్ట్రాన్ సూక్ష్మదర్శినులతో విశ్లేషణ
- కోట్ల ఏళ్ల చరిత్రకు ఆధారమని అంచనా
- మరిన్ని పరీక్షల తర్వాతే పూర్తి స్పష్టత

2లో

# చంద్రబాబుపై రాందేవ్ బాబా ప్రశంసలు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక యోగి, కర్మ యోగి అని, ఆయనలా దేశంలోని ప్రతి ముఖ్యమంత్రి పనిచేస్తే 'వికసిత్ భారత్' లక్ష్యం 2047 కంటే ముందే సాకారం అవుతుందని యోగా గురువు బాబా రాందేవ్ ప్రశంసించారు. శనివారం ఉండవల్లిలోని ప్రజావేదిక వద్ద 'యోగాంధ్ర' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం చంద్రబాబు సైతం ఈ కార్యక్రమంలో పాలుపంచుకుని, రాందేవ్ బాబా నిర్వహించిన యోగసాధనను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా బాబా రాందేవ్ మాట్లాడుతూ.. "సీఎం చంద్రబాబు నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు, కానీ నేను యోగా అతిథిగా వచ్చాను. ఈ వయసులో కూడా ఆయన ఎంతో ఆరోగ్యంగా, చురుకుగా ఉండటం స్ఫూర్తిదాయకం. చంద్రబాబు అభివృద్ధి, దార్శనికత కలిగిన ముఖ్యమంత్రి" అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన 'వికసిత్ భారత్', 'ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి లక్ష్యాల సాధనకు చంద్రబాబు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని కొనియాడారు. భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని చేస్తున్న కృషికి చంద్రబాబు తోడుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అమరావతి నిర్మాణంపై కూడా రాందేవ్ బాబా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ప్రజా రాజధాని అమరావతి ఇప్పుడు యోగ రాజధానిగా మారింది. ఈ రాజధానిని పచ్చదనంతో, అద్భుతమైన అందాలతో తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడి ప్రకృతి సౌందర్యం స్విట్జర్లాండ్‌ను తలపిస్తోంది" అని కితాబిచ్చారు. అంతకుముందు ఉండవల్లి గుహల్లో కొలువైన పద్మనాభ స్వామిని దర్శించుకున్నానని, ఇక్కడి అరటి, మామిడి పండ్లు చాలా రుచిగా ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. చంద్రబాబు ప్రకృతి ప్రేమికుడు, సాంస్కృతిక ప్రేమికుడు, యోగా ప్రేమికుడు, సర్వజన ప్రేమికుడు అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో రాందేవ్ బాబా తన శిష్యులతో కలిసి యోగాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## మూడ్రోజులు ఢిల్లీలో సీఎం

హైదరాబాద్: ఎన్సీపీ (ఎస్పీ) నేత శరద్‌పవార్ మనవరాలు, ఎంపీ సుప్రియా సులే కుమార్తె వివాహ రిసెప్షన్‌కు శనివారం ముంబయి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆదివారం ఢిల్లీ వెళ్లనున్నారు. సోమ,మంగళవారాలు అక్కడే ఉండి పలు అంశాలపై కేంద్ర మంత్రులను కలవనున్నారు. ఇందులో భాగంగా మెట్రోకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్ఎఫ్‌సీ) నుంచి రుణం, రెండోదశ గురించి చర్చించేందుకు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా లేఖ రాశారు. 22, 23 తేదీల్లో సమయమిస్తే ఇద్దరం కలిసి వెళ్లి హైదరాబాద్, తెలంగాణకు అతి ముఖ్యమైన ఈ రెండు అంశాల గురించి చర్చిద్దామని, సమయం ఖరారు చేయించాలని విజ్ఞప్తి చేశారు. మెట్రో అంశంలో మీ జోక్యాన్ని కోరుతూ అన్ని వివరాలతో 16న లేఖ రాశానని, సమావేశం ఏర్పాటు చేయిస్తే అవసరమైన రికార్డులు, వాస్తవాలు సమర్పిస్తానని సీఎం తాజా లేఖలో చెప్పారు. అన్ని ఒప్పందాలు, అనుబంధ డాక్యుమెంట్లను కూడా తనతో పాటు తీసుకొస్తున్నానని పేర్కొన్నారు.

# నేడు నీట్ రీ-ఎగ్జామ్

హైదరాబాద్‌బ్యూరో: వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించే నీట్ (యూజీ) 2026 రీ ఎగ్జామ్ ఆదివారం జరగనుంది. ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో రద్దు చేసిన గత పరీక్షకు బదులుగా జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ఈ రీఎగ్జామ్‌ను నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్ష కోసం నమోదు చేసుకున్నారు. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో 5,432 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నారు. తెలంగాణ నుంచి 73,084 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొత్తం 199 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాయి. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పెన్ అండ్ పేపర్ విధానంలో జరుగుతుంది. బయోమెట్రిక్ ధృవీకరణ, బహుళస్థాయి తనిఖీలు, కేంద్రాల పర్యవేక్షణ కోసం ప్రత్యేక చర్యలు అమలు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి. పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలనీ, నిషేధిత వస్తువులను తీసుకురావద్దని పరీక్ష నిర్వహణా సంస్థ ఎన్‌టీఏ హెచ్చరించింది. డ్రస్ కోడ్, ప్రవేశ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. సోషల్ మీడియాలో ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ కీలు, ప్రత్యేక సేవల పేరుతో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అభ్యర్థులకు సూచించింది. అధికారిక సమాచారం కోసం ఎన్‌టీఏ వెబ్‌సైట్, ధృవీకరించిన వాట్సాప్ సేవలను ఉపయోగించుకోవాలని తెలిపింది. పరీక్ష నిర్వహణకు ముందు దేశవ్యాప్తంగా శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించి కేంద్రాల సన్నద్ధతను పరిశీలించినట్టు అధికారులు తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది.

## అయోధ్యలో తిరుమల తరహా పాలన నృపేంద్ర మిశ్రా ప్రతిపాదనలు!

అయోధ్య రామ మందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్న వేళ, ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా కీలక ప్రతిపాదన చేశారు. ఆలయ నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో అయోధ్యలో కూడా వృత్తిపరమైన పాలనా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. విరాళాలు, హుండీ కానుకల లెక్కింపులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు తనను తీవ్రంగా బాధించాయని, ఇవి భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని నృపేంద్ర మిశ్రా అన్నారు. ఈ నేపథ్యంలో, ఆలయ ట్రస్టు విజ్ఞప్తి మేరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మాట్లాడిన నృపేంద్ర మిశ్రా, ఆలయ నిర్వహణ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో పనిచేసిన అనుభవం ఉన్న ఒక స్వతంత్ర చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)ను నియమించాలని, ఉన్నతస్థాయిలో సిబ్బంది నియామకాలను క్రమబద్ధీకరించాలని సూచించారు. టీటీడీలో కమిషనర్ స్థాయి అధికారి సుదీర్ఘకాలం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించే విధానాన్ని ఆయన ఉదహరించారు. టీటీడీ చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను కాకుండా, దాని పాలనా సూత్రాలను అనుసరించడం ద్వారా పారదర్శకతను పెంచవచ్చని వివరించారు. ప్రస్తుతం సిట్ అధికారులు ఆలయ ఆర్థిక రికార్డులు, బ్యాంకు లావాదేవీలు, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ వివాదాన్ని విపక్షాలు రాజకీయం చేస్తున్నాయని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విమర్శించారు. సిట్ దర్యాప్తులో నిజానిజాలు బయటపడతాయని, భక్తులు ఆందోళన చెందవద్దని కోరారు. కోట్లాది మంది భక్తుల నమ్మకంతో ముడిపడి ఉన్న ఆలయ పవిత్రతను కాపాడేందుకు నిపుణులతో కూడిన నిర్వహణ ఎంతో అవసరమని నృపేంద్ర మిశ్రా అభిప్రాయపడ్డారు.





## ఓటరు జాబితా ప్రక్షాళనలో అప్రమత్తంగా ఉండాలి

*** బీఆర్ఎస్ అవగాహన సదస్సులో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా,ప్రజాస్ఫూర్తి : ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని బీఆర్ఎస్ నేతలు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన 'ఎస్ఐఆర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై అవగాహన సదస్సులో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. ప్రజల భవిష్యత్తును, దేశ పాలనను నిర్దేశించే నాయకులను ఎన్నుకునే శక్తి ఓటుతోనే సాధ్యమవుతుందని అన్నారు.ఈ ప్రక్రియలో ఓటర్లు అవసరమైన ధ్రువపత్రాలను అందించి తమ వివరాలను ధృవీకరించుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం ప్రతి బూత్‌కు పార్టీ తరపున ప్రతినిధులను నియమించిన నేపథ్యంలో పార్టీ శ్రేణులు బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

## అంగారకుడిపై ఆశ్చర్యపరిచే రాయి: శాస్త్రవేత్తల పరిశోధన!

అంగారక గ్రహం గురించి శాస్త్రవేత్తల పరిశోధనలు కొత్త విషయాలను వెలుగులోకి తెస్తూనే ఉన్నాయి. తాజాగా అక్కడి నుంచి భూమికి చేరిన ఓ ఉల్క శకలాన్ని పరిశీలిస్తుండగా అనూహ్య విషయం బయటపడింది. ఇప్పటివరకు అంగారకుడిపై గుర్తించని కొత్త రకం రాయిని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అంతేకాదు తొలిసారిగా గార్నెట్ అనే ఖనిజం ఆనవాళ్లను కూడా గుర్తించారు.

**కెనడా మ్యూజియంలో నమూనా**

ఈ పరిశోధనలో ఉపయోగించిన ఉల్క శకలం పేరు NWA 8171. ఇది ప్రస్తుతం కెనడాలోని రాయల్ ఒంటారియో మ్యూజియంలో ఉంది. నమూనాపై ప్రాథమిక రసాయన పరీక్షలు నిర్వహించినప్పుడు కొన్ని అసాధారణ లక్షణాలు కనిపించాయి. దీంతో శాస్త్రవేత్తలు లేజర్ పరికరాలు, ఎలక్ట్రాన్ సూక్ష్మదర్శినుల సాయంతో మరింత లోతుగా పరిశీలించారు.

**గార్నెట్ ఖనిజం గుర్తింపు**

పరిశీలనలో 'గార్నెట్' అనే ముదురు ఎరుపు రంగు ఖనిజం ఉన్నట్లు తేలింది. పురాతన ఈజిప్టు, రోమన్ నాగరికతల్లో ఈ ఖనిజానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉండేది. భూమిపై భూగర్భ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, పీడన పరిస్థితులను అధ్యయనం చేయడంలో గార్నెట్ కీలకంగా ఉపయోగపడుతుంది. అంగారకుడి నమూనాలో ఇది కనిపించడం శాస్త్రవేత్తలకు ఆశ్చర్యం కలిగించింది.

**కోట్ల ఏళ్ల చరిత్రకు ఆధారం**

ఈ రాయి అంగారకుడి పురాతన భౌగోళిక చరిత్రను దాచుకున్న ఖజానాగా పనిచేస్తుందని నిపుణులు భావిస్తున్నారు. జేమ్స్ డార్లింగ్ నేతృత్వంలోని పరిశోధక బృందం ప్రకారం.. ఈ ఆవిష్కరణ అంగారకుడి భూగర్భ నిర్మాణంపై కొత్త కోణాన్ని చూపిస్తోంది. అక్కడ గతంలో జరిగిన భారీ మార్పులకు ఇది ఆధారంగా నిలిచే అవకాశం ఉందని పేర్కొంది.

**ఇంకా మిగిలిన సందేహాలు**

గార్నెట్ సాధారణంగా తీవ్రమైన వేడి, పీడన పరిస్థితుల్లో ఏర్పడుతుంది. అంగారకుడిపై భారీ ఉల్క ఢీకొనడం లేదా లోపలి మాగ్మా పైకి రావడం వల్ల ఇది ఏర్పడి ఉండొచ్చని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఈ రాయి అసలు అంగారకుడిదే కాకపోవచ్చన్న అవకాశాన్ని కూడా కొట్టిపారేయడం లేదు. మరిన్ని పరీక్షల తర్వాతే దీనిపై స్పష్టత వస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు.





## రైతు సమస్యలపై బీఆర్ఎస్ ధర్నా

*** ధాన్యం కొనుగోలు, 24 గంటల విద్యుత్, యూరియా పంపిణీపై డిమాండ్లు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా,ప్రజాస్ఫూర్తి : రైతు వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. భూపాలపల్లి నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, సన్న, దొడ్డు వడ్లకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మాట తప్పుతోందని ఆరోపించారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో 'యూరియా యాప్' పేరుతో కొత్త విధానాన్ని తీసుకురావడం వల్ల చదువులేని రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. యాప్ విధానాన్ని రద్దు చేసి యూరియాను నేరుగా రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా కొనసాగించాలని, రైతు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. రైతుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## హర్మూజ్ జలసంధిపై ఉద్రిక్తతలు.. చమురు సరఫరాకు ముప్పు!

మధ్యప్రాచ్యంలో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులకు ప్రతిస్పందనగా, ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ నిర్ణయంతో అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది. గత కొద్ది వారాల్లోనే ఇరాన్ ఇటువంటి చర్యకు పాల్పడటం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఇజ్రాయెల్ లెబనాన్‌పై నిరంతర దాడులకు పాల్పడుతోందని ఇరాన్ ఆరోపించింది. శనివారం తెల్లవారుజాము నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో సుమారు 16 నుంచి 32 మంది వరకు మరణించినట్లు లెబనాన్ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఈ దాడులకు నిరసనగానే హర్మూజ్ జలసంధిపై తాము పూర్తి నియంత్రణను తిరిగి చేపట్టినట్లు ఇరాన్ సైనిక కమాండ్ స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో ఐదో వంతు, అలాగే భారీ మొత్తంలో సహజవాయువు రవాణా ఈ జలసంధి గుండానే సాగుతుంది. ఇరాన్‌పై ఆంక్షలను సడలించి, స్విట్జర్లాండ్‌లో అణు చర్చలు నిర్వహించాలని నిర్ణయించిన తరుణంలో ఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం ఆ చర్చలకు ఆటంకం కలిగించేలా ఉంది. ఇరాన్ చర్య ఆమోదయోగ్యం కాదని వైట్‌హౌస్ వ్యాఖ్యానించింది. అయినప్పటికీ, దౌత్యపరమైన చర్చలను కొనసాగించేందుకు ప్రయత్నిస్తామని అమెరికా వెల్లడించింది.

## అమెరికన్ కాన్సులేట్ ప్రాంతంలో ఉన్న రోడ్డుకు ట్రంప్ పేరు పెట్టడం బాధాకరం

**: యాకుబ్**



గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి: హైదరాబాద్ లోని ఫైనాన్స్ డిస్ట్రిక్ట్ లో గల నానక్ రామ్ గూడ ప్రాంతంలోని అమెరికన్ కాన్సులేట్ ప్రాంతంలో ఉన్న రోడ్డుకు అమెరికా అధ్యక్షులు డ్రోనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించడాన్ని సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది సీఐటీయూ జిల్లా నాయకులు యాకుబ్ అన్నారు. శనివారం మండల కేంద్రం లోని అంబేద్కర్ స్తూపం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనగా వ్యక్తం చేసారు ఈ సందర్భంగా యాకుబ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి వల్ల అభ్యంతరాన్ని, నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయాన్నిఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జూన్ 20న రాష్ట్ర వ్యాప్తంగా నల్ల జెండాలతో నిరసన తెలియజేయాలని నిర్ణయించిందన్నారు.

# ప్రతి ఒక్కరూ యోగను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలి

*** ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్**



ప్రజాస్ఫూర్తి, భైంసా: హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం 24 గంటల కౌంట్‌డౌన్ కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముధోల్ శాసనసభ్యులు పవరామారావు పటేల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా,వెంకయ్య నాయుడు, బండారు దత్తాత్రేయ, ఈటల రాజేందర్ తదితర ప్రముఖులు, సహచర ఎమ్మెల్యేలు , ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.కార్యక్రమంలో యోగ ప్రాముఖ్యతపై వక్తలు ప్రసంగిస్తూ, యోగ కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా మానసిక ప్రశాంతత, క్రమశిక్షణ , ఆరోగ్యకరమైన జీవన విధానానికి మార్గమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగను నిత్య జీవితంలో భాగంగా చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# 10 కోట్ల 50 లక్షల నిధులతో గ్రామాల్లో గోదాముల నిర్మాణం

*** ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**



ప్రజాస్ఫూర్తి, భైంసా : గ్రామాల్లో రైతాంగానికి ఇబ్బందులు కలుగకుండా పండించిన పంటను నిల్వ చేసుకోవడానికి ముధోల్ నియోజకవర్గం లోని 35 గ్రామాల్లో ఒక్కో దానికి 30 లక్షల రూపాయల నిధులతో గోదాములను నిర్మించడానికి నిధులు మంజూరు చేయించారు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్.10 కోట్ల 50 లక్షల రూపాయల నిధులతో ఈ పనులు జరగనున్నాయి. ముధోల్ నియోజకవర్గం లో గతంలో ఎన్నడు లేనివిధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.గత పది సంవత్సరాల పాలకుల పాలనలో నియోజక వర్గం వెనుక పడగా, ఎమ్మెల్యే పటేల్ ప్రత్యేక దృష్టి సాధించడంతో పెద్ద మొత్తంలో నిధులు వస్తున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాల్లో పనులు వేగవంతంగా,జరుగుతున్నాయి.బాసర మండలంలోని టాక్లి, కిర్గుల్ కే, భైంసా మండలంలోని బిజ్జూర్, వానలపాడ్, మహాగాం, కుంసర, ఇలేగామ్, కుబీర్ మండలంలోని పార్డి బి, పార్డి కే, పల్సి, హంపోలి, కుంటాల మండలంలోని లింబకే, లింబా బి, విట్టాపూర్, పెంచికల్ పాడ్, ఓలా, లోకేశ్వరం మండలంలోని ధర్మోరా, పిప్రి, అబ్దుల్లాపూర్, కనకాపూర్, నరసింహనగర్ తాండ, ముధోల్ మండలంలోని గన్నోరా, ముద్గల్, బోరిగాం, అష్ట, రాంటేక్, నర్సాపూర్ మండలంలోని తిమ్మాపూర్, డొంగుర్ గావ్, నందన్, తానూర్ మండలంలోని బోరిగావ్ బామ్ని,బొంద్రట్, భోసి, బెల్ తరోడా,గ్రామాల్లో గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయన్నారు.

# బంజేరుపల్లె గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ నాభిశీల బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవం

*** ఆలయ అభివృద్ధి కోసం రూ.10,000 విరాళం అందించిన వంగ రాజేశ్వర్ రెడ్డి**



నారాయణరావుపేట , ప్రజాస్ఫూర్తి : నారాయణరావుపేట మండలం బంజేరుపల్లె గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ నాభిశీల బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వంగ రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని గ్రామదేవతల ఆశీస్సులు పొందారు.ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారంగా వంగ రాజేశ్వర్ రెడ్డి రూ.10,000/ నగదు విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి కి గ్రామ ప్రజలు, యువకులు, పెద్దలు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామ ప్రజలకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామదేవతల కృపాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు.గ్రామదేవతల ఆశీస్సులతో సిద్దిపేట నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మైనారిటీ అభ్యర్థులకు ఉచిత పోటీ పరీక్షల శిక్షణ

**: ఎస్.మురళీధర్ రావు**

జనగామ,ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర మైనారిటీల స్టడీ సర్కిల్, హైదరాబాద్ ఆధ్వర్యంలో మైనారిటీ అభ్యర్థులకు వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన నాలుగు నెలల ఉచిత బేసిక్ ఫౌండేషన్ కోర్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి డా. ఎస్. మురళీధర్ రావు తెలిపారు. టీజీపీఎస్సీ గ్రూప్స్-I, II, III, IV, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ ), బ్యాంకింగ్, యుపీఎస్సీ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు ఈ శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ అర్హత కలిగిన ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, సిక్కులు, జైనులు, పార్శీలు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో కూడిన దరఖాస్తులను ఈ నెల 25వ తేదీలోపు హైదరాబాద్‌లోని తెలంగాణ మైనారిటీల స్టడీ సర్కిల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 04023236112, 9059050062 ఫోన్ నంబర్లను లేదా directormscccc telangana@gmail.com ఇ మెయిల్ ద్వారా సంప్రదించాలని కోరారు.

# వైటిపీఎస్ లో ప్రైవేటీకరణపై ఉద్యోగుల ఆగ్రహం

*** రెండో రోజూ నల్ల బ్యాడ్జీలతో నిరసన**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,(ప్రజా స్ఫూర్తి): యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటిపీఎస్) లోని సీహెచ్పీ,ఎహెచ్పీ విభాగాల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు చేపట్టిన టెండర్ ప్రక్రియపై ఉద్యోగుల నిరసనలు మరింత ఉధృతమవుతున్నాయి. రూ.255 కోట్ల వ్యయంతో మూడు సంవత్సరాల కాలానికి ఈ విభాగాలను ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ లోని టీజీ పీఈజేఏసీ ఆధ్వర్యంలో శనివారం రెండో రోజు కూడా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు.భోజన విరామ సమయంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు, ఇంజనీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీహెచ్పీ,ఎహెచ్పీ విభాగాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల సంస్థ ప్రయోజనాలు దెబ్బతినడమే కాకుండా ఉద్యోగుల భద్రత, భవిష్యత్ ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీజీ పీఈజేఏసీ నాయకులు మాట్లాడుతూ, యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లో ప్రారంభమవుతున్న ప్రైవేటీకరణ ప్రక్రియ భవిష్యత్తులో టీజీ జెన్కో లోని ఇతర విభాగాలకు కూడా విస్తరించే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ ఆస్తులు, కార్యకలాపాలను క్రమంగా ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సీహెచ్పీ,ఎహెచ్పీ విభాగాలను టీజీ జెన్కో ఆధ్వర్యంలోనే కొనసాగించాలని, ఇప్పటికే ప్రారంభించిన టెండర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని ఉద్యోగ సంఘాలు కోరాయి. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించాయి.నిరసన కార్యక్రమంలో టీజీ పీఈజేఏసీ నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఇంజనీర్లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ పతనం

# కొడంగల్ నియోజకవర్గం నుండే మొదలవుతుంది

**: ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కొడంగల్ : కాంగ్రెస్ ప్రభుత్వ పతనం కొడంగల్ నియోజకవర్గం నుండే మొదలవుతుందని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.కొండంగల్ పట్టణ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు సర్ అవగాహన సమావేశంలో మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్వర్ రెడ్డి,మెతుకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొడంగల్ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ ఇంచార్జ్ ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ గెలుపు కొడంగల్ నియోజకవర్గం నుండి మొదలుకానుందని, ఈ అసమర్థత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఓడించి బీఆర్ఎస్ జెండాను కొడంగల్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఎగరవేసి కేసీఆర్ ని మరొకసారి ముఖ్య మంత్రిగా చేసుకుందామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపడుతునే సర్ సర్వే పట్ల అవగాహన ఉండాలని సర్వే సమయంలో సరైన సమాచారం ఇవ్వకపోతే ఓటు జాబితా నుండి పేరు తొలగిపోయే ప్రమాదం ఉందనే ఈ విషయాని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గ్రహించాలని బూత్ స్థాయిలో మన ఓటర్ల పేర్లు జాబితాలో నమోదు అయి ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని తెలియజేశారు.ఈ సమావేశంలో కొడంగల్ నియోజకవర్గ మాజీ జడ్పిటిసిలు,మాజీ ఎంపిపిలు, సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులపై దాడిని ఖండిస్తున్నాం

**: ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాల దౌర్జన్యాలను అరికట్టాలి**

**- గంగాదేవి సైదులు డిమాండ్**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండల కేంద్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమ ఫీజుల దందా, పుస్తకాలు, స్టేషనరీ పేరుతో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులపై జరిగిన దాడిని సీపీఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు తీవ్రంగా ఖండించారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరిన విద్యార్థి నాయకులపై దౌర్జన్యాలకు పాల్పడటం ప్రజాస్వామ్య హక్కులపై దాడి చేయడమేనని ఆరోపించారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన యాజమాన్యాలు వారిపై బెదిరింపులు, దాడులు చేయడం అత్యంత బాధాకరమన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులు, విద్యార్థులను ఆర్థికంగా దోచుకుంటున్నాయని ఆరోపించారు. ఈ అక్రమాలను ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ నాయకులపై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల కార్యకలాపాలకు రక్షణ కల్పించాలని, ప్రైవేట్ యాజమాన్యాల అరాచకాలను అరికట్టాలని, అక్రమ ఫీజుల వసూళ్లపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం సీపీఎం ఎల్లప్పుడూ విద్యార్థులకు అండగా ఉంటుందని, దాడులకు భయపడకుండా విద్యార్థి ఉద్యమాలు కొనసాగాలని గంగాదేవి సైదులు పిలుపునిచ్చారు.

# త్వరలో చిట్యాలలో నూతన బస్టాండ్ ప్రారంభం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : చిట్యాల, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మెరుగైన రవాణా సౌకర్యాలు కీలకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన బస్టాండ్‌ను శనివారం ఆర్టీసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. బస్టాండ్‌లో ఇంకా పూర్తికాని ప్రహరీ గోడ, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాటు, అలంకరణ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి బస్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల సౌకర్యాలను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. రహదారులు, రవాణా సౌకర్యాల అభివృద్ధితో గ్రామాల్లో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు విస్తరించి ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తౌటం లక్ష్మి, ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, తహసీల్దార్ వసంతరావు, మార్కెట్ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, ఏఆర్‌పల్లి సర్పంచ్ కొడారి అశోక్‌తో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాస్టర్ ఇ.కె. ఆధ్వర్యంలో గ్రామ సేవా యజ్ఞం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్‌లో మాస్టర్ ఇ.కె.ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా గ్రామ సేవ యజ్ఞం నిర్వహించారు. నాగయ్య గడ్డలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన గ్రామ సేవ యజ్ఞంలో మాస్టర్ ఇ.కెS ఆధ్యాత్మిక సేవా సంస్థ కొత్తగూడెం బ్రాంచ్ ఫౌండర్లలో ఒకరైన రవిచంద్ర ఆధ్వర్యంలో 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ వెంకటేశ్వర్లు దంపతులతో గ్రామసేవ హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామవరం వాసులకు వారి వారి శారీరక రుగ్మతలను బట్టి ఉచిత హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ ఆరోగ్యానికి ఔషధ సేవ ముఖ్యం కాద అని, సరైన ఆహారం, విహారం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మాస్టర్ ఇ. కే ఆధ్యాత్మిక సేవా సంస్థ సభ్యులు జి.లత, ఆర్.రామారావు, కె.శ్రీనివాసరెడ్డి, కె.స్వామి, సౌజన్య, వీరమల్లు, పి.శ్రీధర్‌రావు, బి.కోటేశ్వరరావు, కె.కమల, నాగేశ్వరరావు, బి.వి.చారి, ఎస్.మనోహర్ కుమార్, కే శ్రీనివాస్, ఎండి ఫజల్, శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ కమిటీ నిర్వాహకులు ఫణి కుమార్, పితాని అబ్బులు, జూపాక రమేష్, నజీర్, పాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల పరిధిలోని,కల్మలచెరువు గ్రామ రైతుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల , పౌరసరపరాల శాఖ మంత్రి కెప్టెన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ,పార్టీలకు అతీతంగా,స్వచ్ఛందగా రైతులు మంత్రి ఫోటోకి పాలాభిషేకం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కల్మల చెరువు గ్రామం నుండి గానుగబండ గ్రామం వరకు ఇటీవల కాలంలో పూర్తయినటువంటి బీటీ రోడ్డును కొనియాడారు. ఒకప్పుడు ఈ రోడ్డు పొలాలకు వెళ్లాలంటే రైతులు చాలా ఇబ్బంది పడేవారమన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో ఈ రోడ్ మంజూరు , పూర్తి అయిన సందర్భంగా రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి కి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు

# మహిళల భద్రతకు ప్రాధాన్యం : కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



జనగామ, ప్రజాస్ఫూర్తి : మహిళల భద్రత, గౌరవం సమాజ అభివృద్ధికి పునాదిగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణకు పోష్ చట్టం అమలులో జిల్లా పరిపాలన చేపడుతున్న చర్యల ను అభినందిస్తూ వ్యవసాయ శాఖ అధికారులు కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞత లు తెలిపారు. మహిళలకు ఏవైనా సమస్యలు ఎదురైతే భయపడకుండా ఫిర్యాదు చేయాలని, సంబంధిత వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో డీఏఓ అంబికా సోనీ తోపాటు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొ న్నారు.

# శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో ఘనంగా జన్మదిన వేడుకలు



రఘునాథ్ పల్లి/ జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని రఘునాథ్ పల్లి మండలం, ఖిలాషాపురం లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హెచ్ఎన్‌కే రాణిరుద్రమ ఆధ్వర్యంలో రీజియన్ చైర్‌పర్సన్ పొన్నాల రాణి సంయుక్త జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తండ్రి శ్రీ పెరుమాండ్ల శ్రీహరి దీపప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాల కార్యదర్శి నాగుల నర్సయ్య, ప్రధానా చార్యులు, ఉపాధ్యాయ బృందం కలిసి పొన్నాల రాణి సంయుక్తను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలి పారు. జన్మదినాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ హెచ్ఎన్‌కే రాణి రుద్రమ సంస్థ తరపున పాఠశాలకు పోడియం ను బహుకరించి, విద్యార్థు లకు నోట్ బుక్స్, జామెటరీ కిట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్లబ్ స భ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# 2 కే రన్, యోగా దినోత్సవ కార్యక్రమాలు

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా కేంద్రం లో రెండు ప్రత్యే క కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఉద యం 6 గంటలకు నెహ్రూ పార్కు నుం చి జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం వరకు 2కే రన్ నిర్వహించనున్నట్లు ఎ న్నికల సూపరింటెండెంట్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కో రారు.నేడు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించు కుని ఉద యం 6:30 గంటలకు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో యో గా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, జిల్లా ఆయుష్ అధికారి మమత తెలిపారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం

* **ప్రొఫెసర్ హుస్సేన్**




ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్ 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు శనివారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ లేదా ఇంటర్ కు సమాన విద్యార్హత కలిగిన అభ్యర్థులు బిఎ, బికం, బిఎస్ సి కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులు అని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 07 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని, మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అభ్యాసన కేంద్రంలో సర్టిఫికెట్ ధృవీకరణ పూర్తి చేసుకుని, అడ్మిషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి ప్రవేశం పొందవచ్చని సూచించారు. ద్వితీయ, తృతీయ సంవత్సర ట్యూషన్ ఫీజు చెల్లింపు చివరి తేదీ 7 ఆగస్టు. ప్రస్తుతం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభ్యాసన కేంద్రంలో యూజీ ద్వితీయ, తృతీయ సంవత్సరాలలో చదువుతున్న విద్యార్థులు తమ ట్యూషన్ ఫీజును ఆగస్టు 07 లోగా ఆన్‌లైన్ విధానంలో తప్పనిసరిగా చెల్లించాలని సూచించారు.మరిన్ని వివరాల కోసం విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.braouonline.com సందర్శించవచ్చు లేదా మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభ్యాసన కేంద్రం కోఆర్డినేటర్ డా. తిరుమల రెడ్డి (సెల్: 7382929698)ను సంప్రదించవచ్చని తెలిపారు.

# చినుకు పడితే కరెంట్ కట్.. కార్మిక కాలనీల్లో విద్యుత్ కష్టాలు

* **రాత్రివేళల్లో దోమలతో జాగారం చేస్తున్న కుటుంబాలు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్, గౌతమ్ పూర్ కార్మిక కాలనీల్లో విద్యుత్ సరఫరా సమస్య తీవ్రంగా మారిందని కార్మిక కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న వర్షం పడినా, చిరుగాలి వీచినా కరెంటు నిలిచిపోవడం నిత్యకృత్యంగా మారిందని వారు అంటున్నారు. తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.

**రాత్రి కరెంటు పోతే దోమలతో జాగారమే**

ఇటీవల తీవ్ర ఉక్కపోత నెలకొన్న సమయంలో రాత్రివేళల్లో విద్యుత్ అంతరాయాలు మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి 10 గంటల తర్వాత కరెంటు పోతే తెల్లవారుజాము వరకు పునరుద్ధరణ జరగడం లేదని, దోమల బెడదతో కుటుంబాలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నాయని కార్మికులు చెబుతున్నారు.

**ఒకప్పుడు ఆదర్శంగా ఉన్న సరఫరా**

గతంలో సింగరేణి విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేదని, ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని కార్మికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా వెంటనే పునరుద్ధరిస్తుండగా, సింగరేణి కాలనీల్లో మాత్రం సమస్యలు గంటల తరబడి కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు.

**ప్రశ్నించని యూనియన్లు.. స్పందించని అధికారులు**

కార్మికుల సమస్యలపై గతంలో వెంటనే స్పందించే కార్మిక సంఘాలు ప్రస్తుతం మౌనం పాటిస్తున్నాయని పలువురు కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్మిక కాలనీల్లో తరచూ విద్యుత్ సమస్యలు ఎదురవుతున్నప్పటికీ, అధికారుల నివాస ప్రాంతాల్లో మాత్రం అంతరాయాలు తక్కువగా ఉంటున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**శాశ్వత పరిష్కారం ఎప్పుడు?**

విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలకు కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు కనిపించడం లేదని కార్మికులు అంటున్నారు. ఏరియాల వారీగా ప్రత్యేక ఫీడర్లు, పీడర్లు ఏర్పాటు చేస్తే సమస్యలను త్వరగా గుర్తించి పరిష్కరించే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. ప్రతి చిన్న మరమ్మతు కోసం మొత్తం ప్రాంతానికి విద్యుత్ నిలిపివేయాల్సిన పరిస్థితిని మార్చాలని కోరుతున్నారు. కార్మిక కాలనీల్లో విద్యుత్ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, వర్షాకాలం పూర్తయ్యే వరకు రాత్రి పూట కూడా నిర్వహణ సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# శరణాలయంలో నిత్యావసర సరుకుల పంపిణీ



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ సంఘ కాపరి సంఘ సభ్యులు ఫాదర్ ఫెజ్జునికుష్టురోగుల కార్యాలయంలో, నిర్మల్ హృదయ మదర్ తెరిసా హోమ్ అనాధశరణాలయంలో, సేవ భావంతో నిత్యవసర సరుకులు, బియ్యం పప్పు మంచి నూనె, చింతపండు తదితర 20 వేల విలువగల సరుకులను అందజేయడం జరిగిందని , ఈ ఈ సేవా కార్యక్రమాన్ని అందజేస్తుంటామని ఈ కార్యక్రమంలోడాక్టర్ ప్రదీప్ సామెల్ పాస్టర్, పీజీ జేమ్స్, జెపి ప్రభు చరణ్, దుబ్బ ఎబినేజర్, డేజీ ఎబినేజర్, దుబ్బభాస్కర్ ,పసలశోరయ్య, ఈ మెహాన్, డాక్టర్ ఆర్ పి అబ్రహం, సిహెచ్ బ్రహ్మచారి, బత్తుల ప్రవీణ్ దమనేశ్వరరావు, పాల్గొన్నారు.

# క్రమశిక్షణ, ఫిట్నెస్ పోలీస్ శాఖకు మూలాధారం

* **విధినిర్వహణ ఎంత ముఖ్యమో, ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యం**
* **వీక్లీ పరేడ్ లో జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల**



ప్రజా స్ఫూర్తి,భైంసా : నిర్మల్ జిల్లా పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో శనివారం జిల్లాలోని సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్, సిబ్బందికి వీక్లీ పరేడ్, జిల్లా ఎస్పీ ఆదేశానుసారం నిర్వహించారు. సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్ డ్రిల్, స్క్వాడ్ డ్రిల్ ప్రదర్శనని ఎస్పీ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి, ఫిజికల్ ఫిట్నెస్ తో పాటు, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి బాగా ఉపయోగపడుతుందని, సమయం దొరికినప్పుడు సిబ్బంది అధికారులు వ్యాయామం చేయడం అనేది చాలా ముఖ్యం అని, మంచి శక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వహించడానికి మంచి అవకాశం ఉంటుంది. ఫిట్నెస్ ను అనునిత్యం కాపాడుకోవాలన్నారు.పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంబించాలన్నారు. క్రమశిక్షణతో డ్యూటీలను నిర్వర్తించాలని జిల్లాకు, తెలంగాణ పోలీస్ శాఖకి మంచిపేరు తీసుకురావాలన్నారు.సిబ్బందికి చేయవలసిన విధులు ,చేయకూడని పనుల గురించి పలు సూచనలు చేశారు. ఏదైనా వ్యక్తి గత సమస్యలు ఉన్న, డ్యూటీల వద్ద సమస్య ఉన్న, ఆరోగ్య సమస్య ఉన్న ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావలన్నారు. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు అలవాటు పడి, విధులలో నిర్లక్ష్యం వహించి పోలీస్ శాఖ ప్రతిష్టకి భంగం కలిగించే విధంగా ప్రవర్తించరాదని హెచ్చరించారు. రెగ్యులర్ గా హెల్త్ చెక్ అప్పేయించుకోవాలన్నారు.వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. సమయం దొరికినప్పుడు కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడపాలని, క్రమశిక్షణతో కూడిన విధులు నిర్వహించాలని తెలిపారు.ఈ పరేడ్ లో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిలతో పాటు, నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్,ఇన్స్పెక్టర్లు గోవర్ధనరెడ్డి,కృష్ణ, సమ్మయ్య,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రామ్ నిరంజన్ రావ్,శేఖర్,ఎస్ఐ లు, ఆర్.ఎస్.ఐ లు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు బంధును రైతు భరోసాగా పేరు మార్చి

# రైతాంగాన్ని మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం

* **బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : రైతుబంధు పేరును రైతు భరోసాగా పేరు మార్చి రైతాంగాన్ని మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని బిఆర్ఎస్ ఎల్పి విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. శనివారం చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ రైతులకు భరోసా కాదు. రైతులతో పాటు రాష్ట్రంలోని అన్నీ వర్గాల ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం ఈ రేవంత్ ప్రభుత్వమన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి పాలనను గాలికి వదిలేసి పేర్ల మార్పుతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి ఈ రేవంత్ ప్రభుత్వం పాలనా తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పేరుకే ప్రజా పాలన కానీ, రాష్ట్రంలో ప్రజలను హింసించే పాలనతో రాక్షస పాలన కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని రైతులను కెసిఆర్ కడుపులో పెట్టుకొని చూసుకుంటూ సమయానికి విత్తనాలను, యూరియాను అందించి పండించిన పంటను కొని రాష్ట్ర రైతాంగానికి బంగారు బాటలు వేసింది కేసీఆర్ అని అన్నారు. నేడు రైతులకు సకాలంలో యూరియాను అందించలేక, పండించిన పంటను కొనకుండా రాష్ట్ర రైతాంగాన్ని హింసిస్తా ఉంది ఈ కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. అమలు కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మూడేళ్లుగా మోసం చేస్తావుందన్నారు. ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ప్రజలు తన మాటను నమ్మరని తెలిసి ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీ ని రాష్ట్రానికి తీసుకొచ్చి రైతులకు డిక్లరేషన్ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. రెండు లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ పేరుతో రుణమాఫీ చేశామంటూ, తూతూ మంత్రంగా రుణమాఫీ చేసి చేతులు దులుపుకుందన్నారు. నియోజకవర్గం కుత్బుల్లాపూర్ లోని దాదాపు 600 మంది రైతులు ఉంటే 13 మందికి రుణమాఫీ ని చేసి చేతులు దులుపుకుంది ఈ ప్రభుత్వమన్నారు. రైతు రుణమాఫీ పై ఊదరగొట్టిన ప్రభుత్వాన్ని అసెంబ్లీ వేదికగా రుణమాఫీ పై ప్రశ్నించగా ప్రభుత్వం తోక ముడుచుకొని పారిపోయిందన్నారు. సీఎం సొంత ఊరైన కొండారెడ్డిపల్లి లోనే 100% రుణమాఫీ చేయలేని చేతగాని దద్దమ్మ ప్రభుత్వం ఈ ప్రభుత్వమన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న అకాల మరణం చెందితే వారి కుటుంబానికి తాను అండగా ఉన్నానంటూ బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ రైతు బీమాను ఏర్పాటు చేసి ఎంతోమంది రైతులకు రైతు బీమాను అందించారన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా ఎంతోమంది రైతులు అకాల మరణం చెందితే రైతు బీమాను ఎగ్గొట్టి రైతులను మోసం చేసిన ప్రభుత్వం ఈ రేవంత్ ప్రభుత్వమన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా వారి ప్రాణాలను తీస్తుందని విమర్శించారు. రైతులకు యూరియాతో పాటు రైతు బంధును అందిస్తూ వ్యవసాయాన్ని పండుగగా మార్చి దేశంలోనే అత్యధిక ధాన్యం దిగుబడి చేసే రాష్ట్రంగా తెలంగాణ అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ దయితే, పండించిన పంటను కేంద్రం అనుమతి ఉంటే గాని కొనలేని నిస్సహాయ స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. రైతు బీమా పథకాన్ని ప్రతి ఒక్కరికి అందేలా చేయాలి.లేదంటే రైతుల తరుపున బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణను సద్వినియోగం చేసుకోండి

* **జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ పిలుపు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : జిల్లాలోని అర్హులైన పౌరులందరూ ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఓటర్ల జాబితాలో తమ వివరాలను సరిచూసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ సూచించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ప్రత్యేక సవరణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని కనీసం మూడుసార్లు సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తారని చెప్పారు. ఓటర్లు ఫారాలను పూర్తి చేసి బీఎల్‌వోలకు అందజేయాలని, లేదా భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని వివరించారు.అక్టోబర్ 1, 2026 నాటికి 18 ఏళ్లు నిండే యువత ఫారం6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించి, ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తామని తెలిపారు. తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 1న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. భూపాలపల్లి నియోజకవర్గంలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ 74 శాతం పూర్తయిందని పేర్కొన్నారు. ప్రతి శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు.సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, డీఆర్‌వో వసంతకుమారి, ఆర్డీవో హరికృష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు అబ్బాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజీమార్గమే రాజమార్గం

* **హుస్నాబాద్ కోర్టు సివిల్ జడ్జి కే. రేవతి**




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి బి. రేవతి మాట్లాడుతూ, "రాజీమార్గమే రాజమార్గం" అని పేర్కొన్నారు. ప్రజలు తమ విలువైన సమయం, డబ్బును వృథా చేసుకోకుండా కోర్టుల చుట్టూ తిరగకుండా, ఇరు వర్గాలు పరస్పరం చర్చించుకుని రాజీ కుదుర్చుకోవడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ పడే కేసులను వేగంగా పరిష్కరించుకోవచ్చని, దీంతో సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరు వర్గాల మధ్య సత్సంబంధాలు కొనసాగుతాయని న్యాయవాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రమిద, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాజశేఖర్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగరాజు, హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సీఐ కొండ్ర శ్రీనివాస్, హుస్నాబాద్ ఎస్సై పి. లక్ష్మారెడ్డి, అక్కన్నపేట ఎస్సై సిహెచ్. ప్రశాంత్, హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఒగ్గోజు సదానందం, న్యాయవాదులు కన్నోజు రామకృష్ణ, బాకం సంపత్, దీకొండ ప్రవీణ్, సంధ్యారాణి వివిధ బ్యాంకుల మేనేజర్లు కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ కాలనీ లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం ధర్నా



జనగామ,ప్రజాస్ఫూర్తి : పట్టణం లోని 5వ వార్డు ఏ.సీ రెడ్డి నగర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీ లో సీసీ రోడ్లు,అండర్ డ్రై నేజీ, సెంట్రల్ లైటింగ్ వంటి మౌలిక వస తులు వెంటనే కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేశా రు.ఈ సందర్భంగా సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ మాట్లాడుతూ, కాలనీ లో మౌలిక సదుపాయాల లేమి తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాణా పురం ఏసీ రెడ్డి నగర్ రహదారి పై వీధి దీపాల కోసం కొత్త వైర్లు ఏర్పాటు చేయ డం తోపాటు సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల ను చేపట్టాలని కోరారు.సమస్యలు పరి ష్కరించకపోతే ప్రజలతో కలిసి ఆందోళ నలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్లు బి.కిష్టయ్య, బి.జ్యోతి మద్దతు తెలిపారు. కార్యక్ర మం లో సీపీఎం నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# కోర్టు ప్రాంగణంలో యోగా సందడి




జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. జడ్జి స్వయంగా పాల్గొని న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలిసి యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజువారీ జీవితంలో ఆరోగ్యానికి ప్రత్యేక సమయం కేటాయించాలని సూచించారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు.కార్యక్రమంలో అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూనూరు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఐ. శివకుమార్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. అక్షయ, న్యాయవాదులు జి. ప్రియాంక, రత్నం కిరణ్, మొయినుద్దీన్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : బోనగిరి శివకుమార్ ల్యాబ్ ఆయన కుమారుడు తరుణ్ కుమార్ శనివారం పుట్టినరోజు సందర్భంగా క్లీన్ హోమ్ గ్రీన్ హోమ్ ప్రోగ్రాం ఆర్గనైజర్ ఆదిమల్ల మణిరాజు ఆధ్వర్యంలో నాగార్జున కళాశాల మైదాన వాకర్స్ ట్రాక్ వెంబడి మొక్కలు నాటనైనది.ఈ సందర్భంగ పుట్టినరోజు జరుపుకుంటున్న బోనగిరి తరుణ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని గత ఎనిమిది సంవత్సరాలుగా మొక్కలు నాటుకుంటూ ఇప్పటివరకు 38వేల మొక్కలు నాటి సంరక్షిస్తున్న ఆదిమల్ల మణిరాజు ను ఆదర్శంగా తీసుకుంటూ ఇది నా చెట్టు కార్యక్రమంలో భాగంగా ఈరోజు నా పుట్టినరోజు సందర్భంగా నా చెట్టు ను నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామిని కావాలని మొక్కలు నాటాను మీరు కూడా మీ పుట్టినరోజు సందర్భంగా మీ పిల్లల పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో డాక్టర్ పుల్లారావు బోనగిరి శివకుమార్ కిన్నెర శ్రీనివాస్ చింతపల్లి వెంకన్న రామ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (రెడ్ హౌస్) లో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్ఆధ్వర్యంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు కెప్టెన్.ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి గారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా చకిలం రాజేశ్వరరావు, అంజాద్ అలీ, కక్కిరేణి శ్రీనివాస్ లు మాట్లాడుతూ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆర్మీలో పైలట్ గా సేవలందించి తర్వాత రాష్ట్రపతి భవన్ లో రక్షణ అధికారిగా పనిచేసి, రాజీవ్ గాంధీ సలహా మేరకు కోదాడ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా రాజకీయాలలో ప్రవేశం చేశారని అన్నారు. సీనియర్ నాయకులు, మాజీ మంత్రి వర్యులు కుందూరు జానారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుదీర్ఘ కాలం పాటు మంత్రిగా పనిచేశారని, 16 శాఖల్లో ఆయన మంత్రిగా పనిచేశారని, ఆయన కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘమైన సేవలు అందించారని నేడు ఆయన కుమారులు ఒకరు ఎంపీగా ఒకరు ఎమ్మెల్యేగా పార్టీకి సేవలు అందిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మహ్మద్ అంజాద్ అలీ,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు భైరు వెంకన్న గౌడ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు వేములకొండ పద్మ, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, 33వ వార్డు స్థానిక కౌన్సిలర్ నాగుల వాసు, మున్సిపల్ కౌన్సిలర్లు సయ్యద్ తన్వీర్ హుస్సేన్, చిలుముల సునీల్ రెడ్డి, వల్దాసు లక్ష్మీ శ్రీనివాస్(రెబల్), కుంభం రాజేందర్,గుణగంటి హేమ సతీష్, పిల్లల భవాని రమేష్నాయుడు, పట్టణ ఎస్సి సెల్ అధ్యక్షుడు పిడమర్తి నాగరాజు, జిల్లా కాంగ్రెస్ నాయకులు అక్కినేపల్లి జానయ్య, గడ్డం వెంకన్న, సాజిద్ ఖాన్, చెంచల నిఖిల్,నరేందర్ నాయుడు, మన్సూర్(ఆర్ట్), ఇబ్రార్ అహ్మద్, నీడ్స్ సాజిద్, గుణగంటి సైదులు, సతీష్, నిరన్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## నకిరేకల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి

* **శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**





ప్రజాస్ఫూర్తి,నల్గొండ : నకిరేకల్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉరుమడ్ల గ్రామంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు చేపట్టిన 15 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ బిల్డింగ్, మరియు 5 లక్షలతో నిర్మించిన గ్రంధాలయం భవణాలని ప్రారంభించారు విద్య, ఆరోగ్యం, సంక్షేమే ప్రభుత్వ ధ్యేయం.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు. యువతలో పఠనాసక్తి పెంపొందించేందుకు గ్రామ స్థాయిలో గ్రంథాలయాల ఏర్పాటు ఎంతో అవసరమని అన్నారు.అనంతరం గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు చేరువ కావాలనే ఉద్దేశంతో ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని నాయకులు కొనియాడారు. పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ట్రస్టులు , సేవా సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వారు పేర్కొన్నారు.

## బడిపంతులుగా మారిన ఎస్పీ నరసింహ

* **విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధించిన ఎస్పీ**





ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లా ఎస్పీ నరసింహ మరోసారి తన ఉపాధ్యాయ వృత్తిని గుర్తు చేసుకుంటూ బడిపంతులుగా మారి విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధించారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఎస్పీ, ఎనిమిదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పాఠాలను బోధించారు. ఉత్తరధృవం, దక్షిణ ధృవం అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించగా, విద్యార్థులు ఆసక్తిగా పాఠాలను విన్నారు. ఎస్పీ బోధనను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలోనే తన కుమారుడు రుత్విక్‌ను చదివిస్తున్న జూనియర్ అసిస్టెంట్ హరితను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారని, విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ వెంకటయ్య, ఎస్ఐలు ఏడుకొండలు, సాయిరాం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంద్రయ్య, అడ్మిషన్ ల ఇంఛార్జ్ ఉపాధ్యాయులు గుంటి సత్యనారాయణ, సుంకర లింగమూర్తి, శ్రీశైలం, చామకూర పద్మ, కృష్ణారెడ్డి, జగదీష్ రెడ్డి, పద్మావతి, నాగమ్మ, సువర్ణ, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## హుషారుగా యువ సమ్మేళనం

* **బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సతీష్**



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: మెదక్ జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శనివారం బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సతీష్ పటేల్ అధ్యక్షతన, కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న "యువ సమ్మేళనం" ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు వల్దాస్ మల్లేష్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి అరవింద్ రెడ్డి హాజరయ్యారు. గత 12 సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ముఖ్యంగా యువత సాధికారతకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు.యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, స్కిల్ ఇండియా మిషన్, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన, మై భారత్, పీఎం ఇంటర్న్‌షిప్ పథకం, నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్, పీఎంసేతు, పీఎందక్ష్, నేషనల్ కెరీర్ సర్వీస్ వంటి అనేక పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా యువతలో ఆవిష్కరణలకు, పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి విశేష ప్రోత్సాహం లభిస్తోందని తెలిపారు.నేటి యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముక అని, వారి శక్తి సామర్థ్యాలను దేశాభివృద్ధి దిశగా వినియోగించుకోవడమే మోదీ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, ఎం.ఎల్.ఎన్ రెడ్డి,కో కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, బీజేవైఎం నాయకులు అరవింద్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ల కంచం సాయి, పోతారాజు అనిల్,జిల్లా యువమోర్చ పదాధికారులు మండల అధ్యక్షులు కార్యక్రమ మండల ఇన్చార్జిలు యువ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుపోటు

* **రైతుల కోసం మరో ఉద్యమానికి సిద్ధం**
* **మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి**





ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: తెలంగాణ రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి విమర్శించారు. శనివారం మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే పంటలు కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం 70 లక్షల మంది రైతులకు తీవ్ర అన్యాయం చేయడమేనని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేయగా, ప్రస్తుతం రైతులను సంక్షోభంలోకి నెట్టే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. రైతులు పండించిన ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతే కేంద్రబిందువుగాపాలన సాగిందని, రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలతో తెలంగాణ వ్యవసాయ రంగం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో నేరుగా లక్ష కోట్లకు పైగా జమ చేసి, రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు.ఎన్నికల సమయంలో అన్ని పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు చేతులెత్తేయడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు.పంటల కొనుగోళ్ల విషయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను దళారుల దయాదాక్షిణ్యాలకు వదిలేస్తోందని ఆరోపించారు.గతంలో కేంద్రం కొనుగోలు చేయని పంటలను కూడా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. రైతుల ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవడం సరికాదని చెప్పారు.తెలంగాణ రైతులు పండించే ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు లావణ్య రెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లు బట్టి. జగపతి,అకిరెడ్డి.కృష్ణారెడ్డి,పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు,మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం.అంజ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి.ఉదయ్ కుమార్,జుబెర్ అహ్మద్, నాయకులు, తదితరులు ఉన్నారు.

## నీట్-2026 రీ ఎగ్జామినేషన్‌కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

* **పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో బి న్ ఎస్ ఎస్ సెక్షన్-163 అమలు.**
* **ఏఎస్పి రమేష్**



ప్రజాస్ఫూర్తి, నల్గొండ : ఈ నెల 21న నిర్వహించనున్న నీట్,యూజీ 2026 రీ ఎగ్జామినేషన్ ను ప్రశాంతంగా, పారదర్శకంగా, సురక్షితంగా నిర్వహించేందుకు నల్గొండ జిల్లా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులు, సిబ్బందితో సమావేశమైన అడిషనల్ ఎస్పీ, పరీక్షల నిర్వహణ సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మార్గదర్శకాల ప్రకారం ఎటువంటి అవకతవకలు, భద్రతా లోపాలు చోటుచేసుకోకుండా ప్రతి అధికారి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.నల్గొండ జిల్లాలో మొత్తం 7 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, ప్రతి కేంద్రం వద్ద తగిన సంఖ్యలో పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లోకి అనుమతి లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని ఆదేశించారు.పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల తనిఖీలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా నిర్వహించాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని కేంద్రాల వద్ద గస్తీ, నిఘా, భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు.పరీక్షల నిర్వహణను సజావుగా కొనసాగించేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ 163 అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం పరీక్షా కేంద్రాల సమీపంలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడటం, అనవసరంగా సంచరించడం, ఆందోళనలు లేదా ఇతర కార్యక్రమాలు నిర్వహించడం నిషేధించబడిందని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని, మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబడరని స్పష్టం చేశారు. అభ్యర్థులు తప్ప ఇతరులను కేంద్రాల లోపలికి అనుమతించబోమని తెలిపారు.పరీక్షా రోజున నల్గొండ జిల్లా కేంద్రంలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు మూసివేయబడతాయని తెలిపారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా రవాణా శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు, గస్తీ, నిఘా చర్యలు అమలు చేస్తున్నామని, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని విధాలుగా సహకరిస్తుందని అడిషనల్ ఎస్పీ తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో నల్గొండ డీఎస్పీ శ్రీ కె. శివరాంరెడ్డి,టూ టౌన్ సీఐ రాఘవరావు, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి,ట్రాఫిక్ సీఐమహాలక్ష్మయ్య,నార్కట్ పల్లి సీఐ సురేష్, వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్సైలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కే.వి.కే. గడ్డిపల్లిలో పీఎంకిసాన్ 23వ విడత నిధుల విడుదల ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమం



గరిడేపల్లి , ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కే.వి.కే.)లో శనివారం పీఎంకిసాన్ సమ్మాన్ నిధి యోజన 23వ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని తారాకేశ్వర్, హుగ్లీ జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో పీఎంకిసాన్ 23వ విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు కేవీకే శాస్త్రవేత్తలు తెలిపారు.ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.18,880 కోట్ల ఆర్థిక సహాయాన్ని నేరుగా జమ చేసినట్లు వివరించారు. భారతదేశ జనాభాలో 50 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నందున, రైతులు ఆధునిక శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు మరియు లాభాలు పొందవచ్చని తెలిపారు.అలాగే పెరుగుతున్న జనాభాకు ఆహార భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు వివిధ పథకాలు, సబ్సిడీలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే కాలంలో ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పప్పుధాన్యాలు, వేరుశనగ, పండ్ల తోటలు వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించాలని సూచించారు.అదేవిధంగా "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమం ద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సహజ మరియు స్థిరమైన వ్యవసాయ విధానాలను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో కే.వి.కే. శాస్త్రవేత్తలు సి.హెచ్. నరేష్, ఎ. కిరణ్, డి. ఆదర్శ్, పి. అక్షిత్, ఎన్. సుగంధి, కంప్యూటర్ ప్రోగ్రామర్ ఎ. నరేష్, ఇఫ్కో ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు, సోమేశ్వర్ కుమార్, రైతులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## భూముల సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

* **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్**



ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: వచ్చే నెలలో చేపట్టనున్న భూముల సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మండల సర్వేయర్లు, లైసెన్సుడు సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెలలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని 70 గ్రామాలలో సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూ సమస్యలు, భూ వివాదాలు లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, ఈ సర్వేను ఆధునిక, సాంకేతిక పద్ధతులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డి జి పి ఎస్, రూవర్స్ జి ఐ ఎస్, క్యూ జి ఐ ఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం జరుగుతుందని, సర్వేయర్లు, లైసెన్సుడు సర్వేయర్లు సాంకేతిక వినియోగంపై పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. సర్వే పూర్తి అయిన అనంతరం భూదార్ కార్డులు ప్రభుత్వం జారీ చేస్తుందని, రైతులకు ఇబ్బందులు కలగకుండా ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.పి. సర్వే ల్యాండ్ రికార్డ్ అధికారి వినయ్, డిప్యూటీ ఇన్స్పెక్టర్లు, మండల సర్వేయర్లు, లైసెన్సుడు సర్వేయర్లు పాల్గొన్నారు.

## స్వర్ణకారులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి

**: స్వర్ణకారులను ఆదుకోవాలని వినతి**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వం స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరుతూ విశ్వకర్మ స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్పొరేట్ సంస్థలు పెద్ద ఎత్తున జ్యూవెలరీ దుకాణాలు ఏర్పాటు చేస్తూ, స్వర్ణకార వృత్తిని దెబ్బతీస్తుందని ఆరోపించారు. స్వర్ణకారుల పరిస్థితి రోజురోజుకీ దినస్థితికి చేరుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్వర్ణకారులను ఆదుకోవాలని కోరారు. స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జీ.వో. 272ను సవరణ చేసి, పటిష్టంగా అమలు చేస్తూ స్వర్ణకారులను దొంగ బంగారం రికవరీల నుంచి కాపాడాలని, 50సంవత్సరాలు దాటిన స్వర్ణకారుల వృత్తిదారులకు గీత, నేత కార్మికులకు ఇచ్చే విధంగా రూ.5వేల పింఛన్ మంజూరు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ విశ్వకర్మ స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు కందుకూరి కిషోర్ కుమార్, ప్రధాన కార్యదర్శి ముటుకుల్లోజు శ్రవణ్ కుమార్, కోశాధికారి చొల్లేటి లక్ష్మీనారాయణ, స్వర్ణకార సభ్యులు కొండోజు సంతోష్‌కుమార్, చేపూరి బిక్షమాచారి, డి.వి చారి, పెరికిటి గోవర్ధనాచారి, మల్లికార్జున్, నగేష్, శ్రీను, రాఘవ, పాండు, అజయ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో కలెక్టర్ పాఠాలు.. విద్యార్థులకు విజయ సూత్రాలు.



తరిగొప్పుల / జనగామ, ప్రజా స్ఫూర్తి : జిల్లా లోని తరిగొప్పుల మండలం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా న్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేక మైన ఆయన ఇంగ్లీష్, గణిత సబ్జెక్టు లపై గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించి పాఠాలు బోధించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేసిన అనంతరం గణితంలో సులభ పద్ధతులు, సమస్యల పరిష్కార మార్గా లను వివరించారు. అలాగే ఇంగ్లీష్ భాషలో అనర్గళంగా మాట్లాడేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై పలు సూచనలు చేశారు. గణితంపై పట్టు సాధిస్తే ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. పాఠశాల లో విద్యా ప్రమాణాలు మరింత మెరు గుపడేలా ప్రతి 15 రోజులకు ఒకసారి మాక్ టెస్టులు నిర్వహించాలని ఉపా ధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి అవసరమైన మార్గదర్శ కత్వం అందించాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, పాలు తదితర ఆహార పదా ర్థాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. పాలలో నీరు కలిపినా, ఆహార నాణ్య త లో లోపాలు గమనించినా వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చే యాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని,క్రమ శిక్ష ణ, పట్టుదలతో ముందుకు సాగితే జీవి తంలో విజయాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాల ను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసు కుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# హ్యాంమ్ రోడ్ల శంకుస్థాపన పైలాన్ పనులను పరిశీలించిన మంత్రి



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్గొండ జిల్లా, కనగల్ మండల కేంద్ర లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించనున్న హ్యాం రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న దృష్ట్యా శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హ్యాం రోడ్ల శంకుస్థాపన పైలాన్ పనులనుపరిశీలించారు.పనులు వేగవంతం చేయాలని ఆయన ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. శనివారం మంత్రి కనగల్ వ్యవసాయ మార్కెట్ సమీపంలో హ్యాం రోడ్ల శంకుస్థాపనకై నిర్మిస్తున్న పైలాన్ పనులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పైలాన్ పనులను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ 13500 కోట్లకు సంబంధించిన పైలాన్ ఎప్పుడు గుర్తుండిపోయేలా నిర్మించాలని, ముఖ్యంగా పైలాన్ చుట్టూ కిందివైపున మూడు రంగుల కలర్ వేయించాలని, అలాగే పెద్ద అక్షరాలతో రోడ్లు, భవనాల శాఖ పేరు అగుపించేలా రాయించాలని, రైలింగ్ తో పాటు, పైలాన్ చుట్టూ అందంగా తీర్చిదిద్దాలని, సాయంత్రం సమయాల్లో గ్రామస్తులు, ప్రజలు పైలాన్ వద్ద గడిపే విధంగా పచ్చ గడ్డి తో తీర్చిదిద్దాలని మంత్రి ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారుఅంతకుముందు మంత్రి ఎన్జి కళాశాల మైదానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. బహిరంగ సభకు హాజరయ్యే ప్రజలు, ఏర్పాటు చేయాల్సిన కుర్చీలు, టెంట్లు, ఎల్ ఈడి స్క్రీన్లు, పార్కింగ్ ఇతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ,జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్లతో చర్చించారు. అంతేకాక ఆ రోజు పట్టణంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని, బహిరంగ సభకు హాజరయ్యే వారికి అవసరమైన ఏర్పాట్లను చేయాలని అధికారులు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్,జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవర్ , స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ శ్రీధర్ రెడ్డి, డి ఈ గణేష్, ఇరిగేషన్ సి ఈ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

# వనజ మృతిపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ రవీందర్ నాయక్ ఆరా



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న కుంజ వనజ మృతి ఘటనపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ రవీందర్ నాయక్ శనివారం జిల్లాకు విచ్చేసి సమగ్రంగా ఆరా తీశారు. డీఎంహెచ్వో డాక్టర్ తుకారాం రాథోడ్, డీసీహెచ్ఓ రవిబాబు, సంబంధిత వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బందితో సమావేశమై గర్భిణికి అందించిన వైద్య సేవలు, చికిత్స వివరాలు, రిఫరల్ ప్రక్రియ, సంఘటనకు దారితీసిన పరిస్థితులు తదితర అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత రికార్డులను పరిశీలించి, విధుల నిర్వహణలో ఎలాంటి లోపాలు జరిగాయో సమగ్రంగా విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విచారణ నివేదికను త్వరితగతిన ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, మాతా, శిశు ఆరోగ్య సేవలు, కుటుంబ నియంత్రణ, వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, టీకా కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ల పనితీరు, సికిల్ సెల్ అనీమియా నియంత్రణ కార్యక్రమం, క్షయవ్యాధి నిర్మూలన, కుష్ఠు నిర్మూలన, వెక్టర్ బోర్న్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై కార్యక్రమాల వారీగా సమీక్ష నిర్వహించారు. ప్రతి కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను నూరుశాతం సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు ప్రతాప్, ప్రసాద్, దినేష్, మోహన్, రామ్ ప్రసాద్ , విప్లవ్ కుమార్, సలిత, శ్రీధర్ , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జాయింట్ సర్వే, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

*** క్షేత్రస్థాయి పరిశీలనలో జిల్లా కలెక్టర్ అంకిత్**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ఫారెస్ట్, రెవెన్యూ జాయింట్ సర్వే, నాన్, క్యాడస్ట్రల్ సర్వే, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం దమ్మపేట మండలంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సర్వే ప్రక్రియ, భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు విధానాలను అడిగి తెలుసుకుని పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు అలైన్మెంట్ను మ్యాప్ ద్వారా పరిశీలించి, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, సర్వే, సరిహద్దుల నిర్ధారణ అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టు పనులకు ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, దమ్మపేట తహశీల్దార్ రామ్ నరేష్, ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ రావు, సర్వేయర్ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

*** నీట్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్**



ఆదివారం నిర్వహించనున్న నీట్ పరీక్షకు సంబంధించి జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ వేణుగోపాల్తో కలిసి జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాలైన టీజీఎస్డబ్ల్యూఆర్ బాలికల పాఠశాల, పాల్వంచ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, కొత్తగూడెం శ్రీ రామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సింగరేణి ఉమెన్స్ కళాశాలలో కలెక్టర్ తనిఖీలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డిఓ మధు, తహశీల్దార్లు దారా ప్రసాద్, పుల్లయ్య, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక సాధికారతకు ఆలేరు వేదిక

*** 51 అగ్రికల్చర్ డ్రోన్ యూనిట్లు – 34 మిల్లెట్ కేఫ్ల ప్రారంభం**

*** ఆధునిక సాంకేతిక రంగాల్లో మహిళలు ముందంజలో నిలవాలి మంత్రి దనసరి అనసూయ పిలుపు**




భువనగిరి, ప్రజాస్ఫూర్తి: గ్రామీణ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం,స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించడం,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మహిళలను కొత్త రంగాల్లోకి తీసుకురావడం లక్ష్యంగా యాదాద్రి భువనగిరి జిల్లా యంత్రాంగం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆలేరు వేదికగా నిలిచింది.రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి,మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) చేతుల మీదుగా మహిళా ప్రాంగణం నూతన భవనం,కమ్యూనిటీ మేనేజ్ ట్రైనింగ్ సెంటర్ (సి.ఎం.టి.సి), జెండర్ రిసోర్స్ సెంటర్ (జి.ఆర్.సి) తో పాటు 51 అగ్రికల్చర్ డ్రోన్ యూనిట్లు,34 మిల్లెట్ కేఫ్ యూనిట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి సీతక్క మహిళల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. జిల్లాలోని 17 మండలాల్లో మహిళా సంఘాలను వ్యవసాయ సేవల రంగంలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో ఒక్కో మండలానికి మూడు చొప్పున మొత్తం 51 అగ్రికల్చర్ డ్రోన్ యూనిట్లను ఏర్పాటు చేశారు.ఈ ప్రాజెక్టులకు బ్యాంకు లింకేజీ,స్త్రీనిధి రుణాల ద్వారా ఆర్థిక సహకారం అందిస్తూ మహిళలు స్వయం ఉపాధి రంగంలో స్థిరపడేలా చర్యలు తీసుకుంటున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో అమలు చేస్తున్న డ్రోన్ యూనిట్లు,మిల్లెట్ కేఫ్ల కార్యక్రమాలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. శిక్షణ,రుణ సదుపాయాలు,సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నకిరేకల్ తుంగతుర్తి ఎమ్మెల్యేలు వేముల వీరేశం మందుల సామెల్ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,జిల్లా అధికారులు,సెర్ప్ ప్రతినిధులు,బ్యాంకు అధికారులు,మహిళా సమాఖ్యల నాయకులు,గ్రామ సంస్థల ప్రతినిధులు,స్వయం సహాయక సంఘాల సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమం మహిళల ఆర్థిక సాధికారత దిశగా మరో కీలక ముందడుగుగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# మనిషి దైవనందన జీవితంలో యోగ తప్పనిసరి..

*** క్రమం తప్పకుండా యోగా చేస్తే రోగాలు మటుమాయం..**

*** యోగ ఆసనాలతో తగ్గుతున్న దీర్ఘకాలిక బీపీ, షుగర్.. థైరాడ్,.. వంటి వ్యాధులు.**

*** నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం**

*** అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా. యోగ పై ప్రత్యేక కథనం.**





నల్లగొండ,ప్రజాస్ఫూర్తి : యోగా వల్ల కలిగే శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించడం, ప్రజలను ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు నడిపించడం దీని ముఖ్య ఉద్దేశం. నేటి ఆధునిక జీవితంలో ఒత్తిడి, ఆందోళనలను తగ్గించి, మానసిక స్పష్టతను పెంపొందించడానికి యోగా ఎంతో దోహదపడుతుందని యోగా గురువులు పేర్కొంటున్నారు . యోగా ఆసనాలు, ప్రాణాయామం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఇది కండరాల బలాన్ని, శరీర సమతుల్యతను మెరుగుపరుస్తుంది. మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధుల నియంత్రణకు యోగా ఒక చక్కటి సాధనం మని చెబుతున్నారు. ఒకే భూమి, ఒకే ఆరోగ్యం, సమగ్ర శ్రేయస్సును సాధించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలను ఏకం చేయడం దీని ప్రధాన లక్ష్యం యోగ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశంఅనిఅభిప్రాయపడుతున్నారు.

యోగాను వయసుతో సంబంధం లేకుండా యోగ ఆసనాలు వేస్తూ ఆరోగ్యంగా జీవిస్తున్నారు. ప్రతి రోజు యోగ చేయడంతో వయస్సు పైబడిన తర్వాత కూడా చురుగ్గా, ఆరోగ్యంగా స్వతంత్రంగా జీవించడానికి యోగా ఏ విధంగా ఉపయోగపడుతుందనే దానిపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నారని పేర్కొంటున్నారు. ఉత్తరార్ధగోళంలో జూన్ 21వ తేదీని వేసవి కాలస్థితి' అంటారు. ఇది సంవత్సరంలోనే అత్యంత సుదీర్ఘమైన పగటి సమయం ఉన్న రోజు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదన మేరకు ఐక్యరాజ్యసమితి 2014 డిసెంబరులో ఈ రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందని యోగ గురువులు చెబుతున్నారు. శారీరక శ్రమ లేని వారికి ఈ యోగాసనాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయని యోగా చేయడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరిగి అనారోగ్య సమస్య లను అధిగమించడానికి ఆస్కారం ఏర్పడుతుందని యోగా సాధకులు పేర్కొంటున్నారు. కూర్చుని పనిచేసేవారికి వచ్చే నడుము నొప్పి, స్పాండిలైటిస్, మెడనొప్పులు వంటివి కూడా యోగాతో దూరమవుతాయని .యోగా రెగ్యులర్గా చేయడం వల్ల శరీరం తేలిగ్గ ఉంటూ ఎముకల్లో బలం పెరుగుతు మనసు హాయిగా ఉంటుంది. కాబట్టి యోగా చేయడం ద్వారా జీవితం ఆనందమయం అవుతుందని యోగ గురువులు పేర్కొంటున్నారు.గత 24 సంవత్సరాలుగా ప్రజలకు యోగ నేర్పిస్తున్న.. యోగా గురువు ఊట్కూరి నాగేశ్వరరావు. గత 24 సంవత్సరముల నుంచి యోగ సాధనలో ఉంటూ ప్రతిరోజు ఉదయము సాయంత్రము నాలుగు బ్యాచ్లు ఆన్లైన్,ఆఫ్లైన్ విదేశీయులకు సైతం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని సీనియర్ గురూజీ ఊటుకూరి నాగేశ్వరరావు తెలిపారు. నల్గొండ పట్టణంలోని రవీంద్ర నగర్ కాలనీ లో పని విహార్ సెంటర్ నందు బోనం మంగారెడ్డి నాగిరెడ్డి దంపతులు వారి సహకారంతో గత రెండు సంవత్సరముల నుండి ఉచితంగా మహిళలకు శిక్షణ తరగతులు తిరుగుతున్నాయి ఈ శిక్షణలో భాగంగా సూర్య నమస్కారాలు చంద్ర నమస్కారాలు శివ నమస్కారాలు హార్డ్ ఆసనాస్ మరియు ధ్యానం నేర్పించడం జరుగుతుంది. ఇందులో ఐదు సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వరకు ఉన్న విద్యార్థులు పెద్దవాళ్లు హాజరవుతున్నారని వారిలో శారీరకంగా మానసికంగా ఆధ్యాత్మికంగా ఎక్కువ మార్పు వచ్చిందని పేర్కొన్నారు. వారిలో దీర్ఘకాలిక రుగ్మతులైన బిపి థైరాయిడ్ షుగర్ బొల్లి స్కిన్ సంబంధించిన రుగ్మతలు బరువు తగ్గడం జరిగిందని తెలిపారు .యోగా శిక్షణ తరగతులకు హాజరు కావడంతో నా ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది..

**మౌనిక పసునూరు.**

నేను గత మూడు సంవత్సరములుగా సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాను. రాత్రిపూట ఎక్కువగా విధులకు హాజరవుతున్నానని నాకు సరిగా నిద్ర ఉండేది కాదు హెడేక్ గా ఉండేది మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉన్నది. యోగ శిక్షణ తరగతులు హాజరు కావడం వల్ల నాకు ఆరోగ్యం బాగా ఉంటుంది మౌనిక పసనూరి, తెలిపారు.మానసిక స్థితి మెరుగైందని ధ్యానం ప్రాణాయామం చేయడం వల్ల ఆరోగ్యం సహకరిస్తుందన్నారు.

*** యోగతో మానసిక ప్రశాంతత కలుగుతుంది.. గృహిణి దాసిరెడ్డి వినీత.**

నేను గృహానిగా ఉంటూ ఎన్నో మానసిక పరిస్థితులు ఎదుర్కొన్నారని వాటి అన్నింటిని అధిగమించడానికి నేను గత రెండు సంవత్సరాలుగా యోగ శిక్షణ తీసుకొని ఆరోగ్యంగా జీవిస్తున్నానని నల్లగొండ పట్టణానికి చెందిన దాసిరెడ్డి వినీత తెలిపారు. యోగ గురువు వద్ద మెలుకువలు నేర్చుకుని ఇప్పుడు నేను గురువుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నానని తెలిపారు.

# ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది

*** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



నల్లగొండ,ప్రజాస్ఫూర్తి : ఈ వానకాలం సీజన్లో రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ఎలాంటి ఎరువుల కొరత లేకుండా అవసరమైన ఎరువులను సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.శనివారం అయన నల్గొండ లోని తన క్యాంప్ కార్యాలయం ఇందిర భవన్ లో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తో కలిసి "ఫర్టిలైజర్ బుకింగ్ యాప్" ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా ఎరువులకు సంబంధించిన సమస్త సమాచారాన్ని తెలుసుకోవచ్చని, ముఖ్యంగా ఎరువుల అందుబాటు, ప్రస్తుత పరిస్థితి, నిలువలు, సులభంగాతెలుసుకోవచ్చన్నారు. ప్రత్యకించి యూరియా అవసరమైన రైతులు ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చని, పట్టాదారు పాసుపుస్తకం, పంట వివరాలను నమోదు చేస్తే రైతు పేరు పైన యూరియాను సరఫరా చేయడంజరుగుతుందన్నారు. ఎకరాకు 2 బస్తాల చొప్పున ఇవ్వడం జరుగుతుందని, ఒక ఎకరా ఉన్నవారికి ఒకేసారి, 1 నుండి 5 ఎకరాలు ఆ పైన ఉన్న వారికి విడతలవారీగా యూరియాను సరఫరా చేయడం జరుగుతుందని, ఉదయం 6 నుండి రాత్రి 10 గంటల వరకు యూరియాను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలలో సొసైటీలు, డిసిఎంఎస్ లు, 650 కేంద్రాలకు పైగా సరిపోను యూరియా ఉందని, ప్రతి రైతుకు యూరియా ఇవ్వడం జరుగుతుందని,ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.విద్యుత్తు అధికారులతో మంత్రి సమీక్షిస్తూ జిల్లాలో ఎలాంటి విద్యుత్ సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు. ముఖ్యంగా పట్టణాలతో పాటు, గ్రామాలలో సమస్య రాకూడదని, విరిగిన స్తంభాలను సరిచేయాలని, ఎక్కడైనా కొత్త ట్రాన్స్ఫార్మర్లు అవసరం ఉంటే తక్షణమే ప్రభుత్వం ద్వారా ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. లోవోల్టేజి సమస్య రాకూడదన్నారు.మున్సిపల్ అధికారులతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఈనెల 21న నిర్వహించనున్న యోగా దినోత్సవానికి సంబంధించిన టీషర్టులను ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, విద్యుత్ అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారి వి. వినోద్ కుమార్ ,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, తదితరులు ఉన్నారు .

# ఖాదర్ బాబా విజ్ఞప్తికి స్పందించిన మున్సిపల్ కమిషనర్

*** మొహరం పండుగ పనులు ప్రారంభం**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో మొహరం పండుగ సందర్భంగా ఏర్పాట్లు కొరకై ఖాదర్ బాబా విజ్ఞప్తికి 6వ వార్డు నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. మొహరం పండుగ సందర్భంగా పీరీల కొట్టం ప్రాంతంలో జరుగుతున్న ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి అవసరమైన పనులను.జెసిపి ద్వారా మున్సిపల్ సిబ్బందితో పనులు వేగవంతం చేశారు. గ్రామ ప్రజలు సమస్యలు తెలియజేయడంతో స్పందించిన అధికారులు మొహరం ఉత్సవాల నిర్వహణకు అవసరమైన సౌకర్యాల కల్పనతో పాటు పారిశుధ్యం నిర్వహణ తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు.గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి పైపులు పగిలిపోవడంతో వెంటనే స్పందించిన మున్సిపల్ కమిషనర్, మరమ్మతు పనులు చేపట్టి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మొహరం ఏర్పాటుకు సహకరించిన మున్సిపల్ కమిషనర్ కు అలాగే 6వ వార్డు వార్డు కౌన్సిలర్ ముఖ్య బుజ్జి రాంజీ నాయక్ కు ముస్లిం సోదరులు ప్రత్యేకగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ జావిద్. షేక్ ఖాజీ. షేక్ జానీ. షేక్ యూసుఫ్. షేక్ సోహెల్. షేక్ మున్న. షేక్ ఆఫ్రిద్. షేక్ రెహన్. షోహెల్ బాబా. పాల్గొన్నారు.

# భద్రతా ప్రమాణాలు పాటించిన వాహనాలకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వాలి




జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లాలో నడుస్తున్న స్కూల్ బస్సులు, ప్రైవేట్ బస్సు లను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి భద్ర తా ప్రమాణాలు పాటిస్తున్న వాహనాల కు మాత్రమే ఫిట్ నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్టీ డబ్ల్యూఎఫ్‌సీఐటీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏ.ఓ బెంజిమెన్‌కు శుక్రవారం వినతిపత్రాని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బూడిద ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి సుంచు విజేందర్ లు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యా ర్థులు, సాధారణ ప్రయాణికుల భద్రతను దృష్టి లో ఉంచుకుని జిల్లాలోని అన్ని స్కూల్, బస్సుల పై ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వ హించాలని కోరారు.వాహనాల బ్రేకులు, టైర్లు,అత్యవసర ద్వారాలు,ఫస్ట్‌ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, బీమా పత్రా లు, అనుమతులు తదితర భద్రతా ప్ర మాణాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత కలిగిన వాహనాలకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని విజ్ఞప్తి చేశా రు. జిల్లా లోని పలు ప్రైవేట్ పాఠశాల లు,కళాశాలల్లో నడుస్తున్న కొన్ని బస్సు లు సరైన కండిషన్ లో లేకపోవడంతో గతంలో ప్రమాదాలు చోటుచేసుకున్నా యని పేర్కొన్నారు.రవాణా శాఖ పర్య వేక్షణను మరింత కట్టుదిట్టం చేసి, ఫిట్ నెస్ ప్రమాణాలు పూర్తి చేసిన బస్సుల కు మాత్రమే పాఠశాలలు, కళాశాలల్లో నడిపేందుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలాగే ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, పూర్తి బీమా కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమిం చాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు చీర శ్రీనివాస్, దయా సాగర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్సి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన బొల్లం అక్షయ కు అభినందనలు

* **రేవా జిల్లా అధ్యక్షులు, పి ఆర్ టి యు టి ఎస్ మహబూబాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు.సంకా బద్రినారాయణ**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఇటీవల వెలువడిన ఎస్ఎస్సి పరీక్ష ఫలితాల్లో జిల్లాలో 589 / 600 లకు మహబూబాబాద్ జిల్లాలో ఉత్తమ మార్కులు సాధించిన బొల్లం అక్షయని జిల్లా అధ్యక్షులు సంకా బద్రినారాయణ శాలువా, బహుమతితో ఘనంగా సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండాలని ఆశీర్వదించారు, అక్షయ తల్లిదండ్రులు సుశీల, శ్రీధర్ కృషిని అభినందించారు. ఇంత చిన్న వయసులోనే చూపిన లక్ష్యసాధన అంచలంచల పట్టుదల ఎంతో క్రమశిక్షణతోని సాధించిన మార్కులులని అన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి ఆమెను ఆదర్శంగా తీసుకోవాలి అన్నారు.ఆమె భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ మహబూబాబాద్ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో రేవా గౌరవ అధ్యక్షులు సోమా గోవర్ధన్, బాధ్యులు నిరంజన్ రెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన

* **మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్**

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : భారతదేశానికే వెన్నెముకగా ఎదిగిన తెలంగాణ రైతులకు దారుణంగా వెన్నుపోటు పొడిచి బంగారు తెలంగాణ ప్రజల బతుకులను ఆగం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు.హుస్నాబాద్ పట్టణంలో శనివారం బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత బిఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఎంతో సమర్థతో పని చేసిందని రైతులకు ఉచిత కరెంటు, రైతు బీమా, రైతు బంధు, ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేసి రైతులకు మేలు చేసిన ఘనత మాదేనని రైతులకు ఎక్కడలేని హామీలను ఇచ్చి ఎగనామం పెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన విమర్శించారు. తెలంగాణలో పండే పంటల్లో కేంద్రం కొనేది ఆరకోర మాత్రమే అందులో వడ్లు మూడో వంతు మిగతా పంటలు కేవలం 25% మాత్రమేనని సతీష్ కుమార్ అన్నారు. రాష్ట్ర సర్కారు ఇంత దారుణంగా చేతులెత్తేస్తే ఇక 70 లక్షల మంది రైతులకు దిక్కెవరో ప్రభుత్వం సమాధానం చెప్పవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇప్పటికే తెలంగాణలో ఏ రహదారి చూసిన రైతుల ఆందోళనలు నిరసనలతో హోరెత్తుతుందని ఇటు సీజన్ మొదలైన యూరియా కష్టాలు మళ్లీ మొదటికి రావడం ఈ ప్రభుత్వ వైఫల్యానికి కారణం అని అన్నారు. ఇంత దారుణమైన పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడుతుంటే మంత్రులు ఎమ్మెల్యేలు సాయిలేకుంట ఉన్నారని అన్నారు..ఈ విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమకొండ మాజీ జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్,మరియు వివిధ మండలాల మాజీ జెడ్పిటిసిలు మాజీ ఎంపీపీలు సర్పంచులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదగిరిగుట్ట మున్సిపాలిటీ లోనిఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం లో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ స్థానిక శాసన సభ్యులు బీర్ల ఐలయ్య , జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు. పాల్గొన్నారు. గృహప్రవేశం అనంతరం కుటుంబ సభ్యులకు పట్టు వస్త్రా లను అందజేసి,గొర్రె పొట్టేలు ను ఇంటి సభ్యులకు బహుమతి గా మంత్రి సీతక్క మంత్రి ,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య. అందజేశారు

## చెరువు భూమి కబ్జాకు యత్నం

**అడ్డుకున్న గ్రామస్తులు...**



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామ శివారులోని ఊర చెరువుకు ఆనుకుని పట్టా భూమి కలిగిన వ్యక్తి శనివారం సాయంత్రం ప్రొక్లిన్ తో చెరువులో తవ్వకాలు చెపట్టాడు. విషయం తెలియగానే చుట్టు పక్కల వారు అడ్డుకోవడంతో వెంటనే తవ్వాకాలను నిలిపివేసి ప్రొక్లిన్ ను బయటకు తీసుకెళ్లిపోయారు.అప్పటికే సుమారు అర ఎకరం వరకు చెరువులో మట్టిని తవ్వి తన పొలంలో వేసుకున్నారు. విషయం తెలియగానే రెవెన్యూ సిబ్బంది చెరువు వద్దకు చేరుకోని విచారణ చేపట్టారు. రెవెన్యూ సిబ్బంది రాకను గమనించి ప్రొక్లిన్ కు తాళాలు వేసి డ్రైవర్ పారిపోయారు.ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ వెంకటేశ్ ను సంప్రదించగా చెరువులో పట్టాలున్నప్పటికి ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదని దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ట్రినిటీలో ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలు





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు యోగాసనాలు వేశారు. అదేవిధంగా యోగ డే ఆకారంలో విన్యాసాలు వేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కే వి బి కృష్ణారావు మాట్లాడుతూ యోగాను ప్రపంచానికి తెలియజేసిన ఘనత భారతదేశం సొంతమన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠాలు బోధించిన జిల్లా కలెక్టర్

* **రుచికరమైన,నాణ్యమైన డైట్ మెనూ పక్కాగా అమలు చేయాలి**
* **జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : జిల్లాలోని బయ్యారం మండల పరిధిలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ విస్తృతంగా పర్యటించారు, మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి పిల్లలతో స్వయంగా మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు కలిపి (1032) ఉన్నాయని, అందులో చదువుతున్న 1 లక్ష 90 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన డైట్ మెనూ ప్రకారం పక్కాగా బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, స్నాక్స్ అందించాలని,పిల్లలకు అర్థమయ్యే రీతిలో డిజిటల్ తరగతుల ద్వారా విద్య బోధనలు అందించాలని, ప్రతి ఒక ఉపాధ్యాయుడు అందుకు అనుగుణంగా పకడ్బందీ ప్రణాళిక ద్వారా టైం టేబుల్ సిద్ధం చేసుకోవాలని, పిల్లలను వ్యక్తిగతంగా గమనిస్తూ ఉండాలని, విద్య అంశాలపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. బడిబాట కార్యక్రమంలో ఇప్పటివరకు 6వేల 709 మంది విద్యార్థినీ విద్యార్థులు నమోదు చేసుకోవడం జరిగిందని, మరింత విస్తృత ప్రచారం అవగాహన కల్పించి ప్రభుత్వ విద్యా సంస్థలలో అందిస్తున్న సౌకర్యాలను తెలియపరచాలని తద్వారా నమోదు శాతం పెంచేందుకు అన్ని విద్యాసంస్థల సిబ్బంది కృషి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తున్న సిబ్బంది,కిందిస్థాయి ఉద్యోగుల కు కచ్చితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని అట్టి నివేదికలను సమర్పించాలని,వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరికి టెస్ట్ బుక్కులు ,నోట్ బుక్స్ అందించాలని,తెలుగు అన్ని సబ్జెక్టులతో పాటు ఇంగ్లీషులో ప్రావీణ్యం పొందడం కోసం ఉపాధ్యాయులు ఇంగ్లీషులోనే పిల్లలకు విద్యను అందించాలని, వారితో మాట్లాడాలని తెలిపారు,జిల్లా వ్యాప్తంగా పిల్లలకు విద్యాబోధనలు హెల్త్ ,సానిటేషన్, న్యూట్రిషన్, మెడిటేషన్,క్రీడా, మేధస్సు లను వెలికి తీయాలని,విద్య అంశాలకు సంబంధించి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మూర్తి,బయ్యారం తహసిల్దార్ నాగరాజు, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

## అర్హులైన విద్యార్థులు ఈ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

* **మండల విద్యాధికారి రాజేందర్**



ప్రజాస్ఫూర్తి, జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో శనివారం రోజున ఐటిఐ ఎటిసి సమాచార గోడ రతులను ఐటిఐ ప్రిన్సిపాల్ తో కలిసి మండల విద్యాధికారి రాజేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ నేటి ప్రపంచంలో సాధారణంగా డిగ్రీ చదువులు కాకుండా పరిశ్రమలు కోరుకునే నైపుణ్యాలను (స్కిల్స్) నేటి యువతకు ఎంతో అవసరం ఉందని, పరిశ్రమలకు అవసరమైన విద్యావ్యవస్థను ఉద్యోగ మార్కెట్ ను పెంపొందించే దిశగా అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ లలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుంది. ఈ అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ లు యువత భవిష్యత్తును తీర్చిదిద్దే వేదికలు కానున్నాయి. యువతకు విద్యా శిక్షణ ఉపాధి నైపుణ్యం అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ ఏ.టి.సీ. లలో సిఎన్సి, విజువల్, ఇంజనీరింగ్, డిజైన్, రోబోటిక్, మ్యానుఫ్యాక్చరింగ్, ప్రాసెస్, ఎలక్ట్రికల్, వెహికల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మొదలగు కోర్సులు నిర్వహిస్తున్నది. ఈ కోర్సులలో అడ్మిషన్ పొందుటకు ఈనెల 30వ తారీకు వరకు గడువు ఉన్నది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంధన్ పల్లి ప్రధానోపాధ్యాయులు ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎస్ఆర్ సదస్సు 2026 పోస్టర్ ఆవిష్కరించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్




నల్లగొండ,ప్రజాస్ఫూర్తి : దక్షిణ భారతదేశ అతిపెద్ద సీఎస్ఆర్ సదస్సు 2026 అధికారిక పోస్టర్‌ను తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. "మార్పు నుండి వారసత్వం వైపుఅనే ఇతివృత్తంతో జరగనున్న ఈ సదస్సు 2026జూలై 25న హైదరాబాద్‌లో నిర్వహించబడుతుంది. ఈ సదస్సుకు దాదాపు 300 ప్రముఖ కార్పొరేట్ సంస్థలు 1,200 కి పైగా స్వచ్ఛంద సంస్థలు హాజరుకానున్నాయి. కార్పొరేట్ సంస్థలు మరియు స్వచ్ఛంద సంస్థల మధ్య భాగస్వామ్యాన్ని పెంపొందించడం, విజయవంతమైన సీఎస్ఆర్ కార్యక్రమాలను ప్రదర్శించడం, మరియు దీర్ఘకాలిక సామాజిక ప్రభావం కోసం వ్యూహాలను రూపొందించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యం.ఈ సందర్భంగా మాట్లాడిన గడ్డం ప్రసాద్ కుమార్ ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, సమ్మిళిత అభివృద్ధి మరియు జాతి నిర్మాణంలో వ్యాపార సంస్థలు, పౌర సమాజం మధ్య సహకారం ఎంతో కీలకమని అన్నారు.సదస్సు నిర్వాహకులు స్పీకర్ గారికి సదస్సు లక్ష్యాలు, నిర్మాణం ముఖ్యాంశాలను వివరించారు. ఈ సదస్సు సీఎస్ఆర్ వ్యవస్థను బలోపేతం చేస్తూ, శాశ్వత ప్రభావాన్ని చూపే చర్యలకు స్ఫూర్తినిస్తుందని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు.సౌత్ ఇండియా సీఎస్ఆర్ సదస్సు నిర్వహణ బృందంసలహాదారు: ఎం. వి. గోనా రెడ్డి, లైసెన్సీ: వినిల్ ఎడుదొడ్ల, సౌత్ ఇండియా సీఎస్ఆర్ మేనేజర్: జతిన్ , సౌత్ ఇండియా సీఎస్ఆర్ సదస్సు. తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి ఆదర్శంగా నిలిచిన గ్రామ ప్రముఖులు




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మండలంలోని, జంగిలిగొండ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో పాఠశాల మూతపడే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్ గుండెల రేణుక ఇచ్చిన పిలుపుతో గ్రామ ప్రముఖులు స్పందించి ప్రభుత్వ పాఠశాలను కాపాడేందుకు ముందుకు వచ్చారు.గ్రామ ఉపసర్పంచ్ కోయల అనిల్ తన కుమార్తెను, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మట్టికాసం వీరేష్ తన కుమార్తెను, ఐకేపీ వీవో సీఏ గోల్కొండ స్రవంతి తన కుమారుడిని, ప్రైవేట్ ఉద్యోగులు వేముల మధు,వేముల మురళి, జర్నలిస్టు పోతుగంటి విజయ్ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు.ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో పాఠశాల మూతపడే ప్రమాదం నెలకొనడంతో గ్రామ సర్పంచ్ గుండెల రేణుక, ఉపసర్పంచ్ కోయల అనిల్, వార్డు సభ్యులు బోయిని వెంకటేశ్వర్లు, కొయ్యల కోమిరెల్లి, ఇరుగు రమేష్, రత్నపురం సునీతలు కలిసి బడిబాట కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించి, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుండెల రేణుక మాట్లాడుతూ, గ్రామ ప్రభుత్వ పాఠశాల మనందరి ఆస్తి అని, దానిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చదివించే కుటుంబాలకు ఇంటి నల్లా పన్నులు, ఇతర స్థానిక పన్నులను తన సొంత ఖర్చులతో చెల్లిస్తానని ప్రకటించారు.అలాగే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాల అమలులో ఆ కుటుంబాలకు ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మానుకోటలో జరిగే సభకు ఉద్యమకారులంతా తరలిరావాలి

* **పూర్వ తెలంగాణ జెఏసి మానుకోట మండల కన్వీనర్ శంతన్ రామరాజు**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మానుకోటలో ఆదివారం జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశానికి ఉద్యమకారులంతా తరలి రావాలని పూర్వ జేఏసీ మానుకోట కన్వీనర్ శంతన్ రామరాజు పిలుపునిచ్చారు. శుక్రవారంనాడు స్థానిక అమరవీరుల స్థూపం వద్ద కోకన్వీనర్ కమ్మగాని కృష్ణమూర్తి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ ఎందరో విద్యార్థులు, మేధావులు బలిదానాల పునాదులై నిర్మితమైన ఈ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమం కోసం కార్యాచరణ రూపొందిస్తోందని హర్షం వ్యక్తంచేశారు. అందులో భాగంగా ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులైన ఎమ్మెల్సీలు కోదండరాం, అద్దంకి దయాకర్ ఆదివారం మానుకోట ఆర్తి కల్యాణ మండపంలో జరిగే ఉద్యమకారుల సమావేశానికి రానున్నారని పేర్కొన్నారు. నాడు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులంతా తరలి రావాలని కోరారు. ఈకార్యక్రమం ద్వారా ఉద్యమకారుల సూచనలు సలహాలు తీసుకుంటారన్నారు. అదేవిధంగా ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వ విధివిధానాలు వివరిస్తారన్నాడు. జబట్టి ఉద్యమకారులంతా ఈ ఆదివారం 21వ. తేదీన జరిగే సమావేశానికి తప్పకుండా హాజరుకానున్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు కంబాలపల్లి సత్యనారాయణ,కరాటే ఖాజా,ముదారి బుచ్చయ్య, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలమంతా ఒక్కటేచిచ్చు పెడితే ఊరుకునేది లేదు

ప్రజాస్ఫూర్తి , జన్నారం : ఆదివాసీలమంతా ఒక్కటేనని మా మధ్య చిచ్చు పెట్టి గొడవలు సృష్టించాలని చూస్తే ఊరుకునేదే లేదని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు రాయసిడం కాళీ, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ లు హెచ్చరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసి సంఘాలు ఐక్యంగా ఉండి పోరాటం చేస్తున్నాయని, ఆదివాసి సంఘాలు కుల పెద్దల మధ్య చిచ్చులు పెట్టి గొడవలు సృష్టించాలని చూస్తున్నారని,అలాంటివి చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జన్నారం శివారులో ఉన్న ఆదివాసి మహిళకు చెందిన భూమిని రెవెన్యూ అధికారులు తిరిగి ఇవ్వాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు ఈ సమావేశంలో రాజగోండ్ సేవాసమితి అధ్యక్షుడు హనుమంతరావు, నాయకులు మనోజ్,ధర్మ పటేల్, పెంద్రం రాజేష్, చిన్ను, గంగు, జంగు ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సినిమా



## ఆ క్షణాల కోసం ఎదురుచూస్తున్నా



హాలీవుడ్‌లో మరో క్రేజీ సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది ప్రియాంక చోప్రా. ఏంజెలినా జోలీతో కలిసి ఓ భారీ బడ్జెట్ సినిమా చేయబోతుంది. ఈ విషయాన్ని ప్రియాంక చోప్రా ఓ ఇంటర్వ్యూలో అఫీషియల్‌గా కన్ఫామ్ చేసింది. హాలీవుడ్ సినిమాలు చేయడానికి ఒక రకంగా తనకు ఏంజెలినా జోలీ స్ఫూర్తి అని, ఆమెతో కలిసి స్కీన్‌ను షేర్ చేసుకునే అవకాశం దక్కిందంటే నమ్మలేకపోతున్నానంటూ చెప్పింది. ఈ మూవీ సెట్స్‌లో అడుగుపెట్టే క్షణాల కోసం ఎదురుచూస్తున్నానంటూ తెలిపింది. అయితే ఈ మూవీలో ఏంజెలినా హీరోయిన్‌గా నటిస్తోండగా ప్రియాంక విలన్‌గా కనిపిస్తుందని సమాచారం. కాగా మహేష్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో వస్తున్న వారణాసి మూవీలో ప్రియాంక నటిస్తోంది. ఆమెకు ఫస్ట్ తెలుగు మూవీ ఇదే.



## అవన్నీ అబద్దాలే..

దాదాపు 45 ఏళ్ల తర్వాత కోలీవుడ్ స్టార్ హీరోలు కమల్‌హాసన్, రజనీకాంత్ కలిసి ఓ మల్టీస్టారర్ సినిమా చేస్తోన్నారు. నెల్సన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శృతి హాసన్ ఓ కీలక పాత్రలో నటిస్తోన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలే కమల్‌హాసన్, రజనీకాంత్‌లను శృతి హాసన్ కలవగా ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. అయితే తండ్రితో కలిసి సినిమా చేస్తోన్నట్లు వస్తోన్న రూమర్లపై శృతి రియాక్ట్ అయ్యింది. అవన్నీ అబద్దాలే. నాన్నను, రజనీకాంత్‌ను కలిసిన మాట నిజమే. కానీ సినిమా కోసం కాదు. ఈ భారీ బడ్జెట్ సినిమాలో నాకూ భాగం కావాలనుంది. అవసరం లేకపోయినా నా కోసం ప్రత్యేకంగా క్యారెక్టర్లను క్రియేట్ చేయడం నచ్చదు అని చెప్పుకొచ్చింది శృతి. కాగా ప్రస్తుతం తెలుగులో ఆకాశంలో ఒక తార సినిమాలో ఓ ఇంపార్టెంట్ రోల్ చేస్తోంది ఈ అందగత్తే. దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమాకు పవన్ సాదినేని దర్శకత్వం వహిస్తున్నారు.

## సమంతను బీట్ చేసిన రశ్మిక

టాలీవుడ్ స్టార్ హీరోయిన్లు సమంత, రష్మిక మందన్న ఒకే రోజు బాక్సాఫీస్ వద్ద పోటీపడ్డారు. సమంత హీరోయిన్‌గా నటించిన తెలుగు లేడీ ఓరియెంటెడ్ మూవీ మా ఇంటి బంగారంతో పాటు రష్మిక మందన్న బాలీవుడ్ రొమాంటిక్ మూవీ కాక్ టెయిల్ 2 శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చాయి. ఇద్దరి కెరీర్‌లో ఫస్ట్ డే హయ్యెస్ట్ కలెక్షన్స్ రాబట్టిన సినిమాలుగా రికార్డులు నెలకొల్పా యి. మా ఇంటి బంగారం శుక్రవారం వరల్డ్ వైడ్‌గా 13.15 కోట్ల కలెక్షన్స్ రాగా కాక్‌టెయిల్-2 వరల్డ్ వైడ్‌గా రూ.24 కోట్లు కొల్లగొట్టింది. రష్మిక బాలీవుడ్ కెరీర్‌లో ఫస్ట్ డే హయ్యెస్ట్ కలెక్షన్స్ రాబట్టిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. ఇండియాలో ఈ సినిమాకు రూ.13 కోట్ల వసూళ్లు రాగా ఓవర్సీస్‌లో రూ.11 కోట్లు రాబట్టింది. సమంత మూవీకి నందిని రెడ్డి దర్శకత్వం వహించారు.





## రుక్మిణి డీప్ ఫేక్ కేసు.. ముగ్గురి అరెస్టు

కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ బికినీ మార్ఫింగ్ కేసులో ముగ్గురిని కర్ణాటక పోలీసులు అరెస్ట్ చేశారు. కర్ణాటకకు చెందిన రవికుమార్, చంద్రకాంత్, రంజిత్ ఈ అసభ్యకర మార్ఫింగ్ వీడియోలను క్రియేట్ చేశారని గుర్తించారు. ఐటీ యాక్ట్ కింద ఈ ముగ్గురిపై కేసును నమోదు చేశారు. వారి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల రుక్మిణి స్విమ్మింగ్‌పూల్‌లో బికినీ ధరించి ఫొటోలకు ఫోజులిస్తూ కనిపించడం దక్షిణాది సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తన వ్యక్తిత్వాన్ని దిగజార్చేందుకు కావాలనే నెగెటివ్ క్యాంపెయిన్ చేస్తున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుతం తెలుగులో ఎన్టీఆర్‌తో డ్రాగన్ మూవీ చేస్తోంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

## తల్లి కాబోతున్న సమంత ?

టాలీవుడ్ హీరోయిన్ సమంత తల్లి కాబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. శనివారం మా ఇంటి బంగారం సక్సెస్ సెలబ్రేషన్స్‌ను హైదరాబాద్‌లో నిర్వహించగా భర్త రాజ్ నిడిమోరుతో కలిసి సమంత పాల్గొన్నది. ఈ ఈవెంట్‌లో ఆమె బేబీ బంప్‌తో కనిపించడం ఆసక్తికరంగా మారింది. ఆమె తల్లి కాబోతుందని అంటున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సమంతకు నెటిజన్లతో పాటు ఫ్యాన్స్ కంగ్రాట్స్ చెబుతున్నారు. అయితే ప్రెగ్నెన్సీ రూమర్లపై సమంతతో పాటు రాజ్ నిడిమోరు మాత్రం రియాక్ట్ కాలేదు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.